రేషన్ బండ్లు.. ఇంటికే..!

● షాపుల వద్దే సరుకుల పంపిణీ
● రేపటి నుంచి అమలులోకి..
● యంత్రాంగం సిద్ధం



అనంతపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థలో సర్కారు పాత విధానానికే జైకొట్టింది. వైసీపీ హయాంలో అమలు చేసిన ఇంటింటికీ రేషన్ విధానానికి చెక్‌పెట్టింది. ఈ పద్ధతిలో అక్రమాలు, ప్రభుత్వానికి అదనపు భారం పడుతుండడంతో ఎండీయూ వాహనాలను కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. జూన్ ఒకటో తేదీ నుంచే దీనిని అమలు చేయనున్నారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. దీంతో తమకు ఉపాధి దూరం చేశారంటూ ఎండీయూ వాహన ఆపరేటర్లు ఆందోళన బాట పట్టారు. డీలర్లు మాత్రం మళ్లీ తమకు పూర్వ వైభవం వచ్చిందని ఆనంద పడుతున్నారు.

నెలకు రూ.85 లక్షల ఆదా

అనంతపురం జిల్లాలో 6,60,330 రేషన్ కార్డులున్నాయి. 1,645 రేషన్ షాపులున్నాయి. వైసీపీ హయాంలో డీలర్ల నుంచి ఎండీయూ వాహనాలకు సరుకులు అందిస్తే ఆపరేటర్లు ఇంటింటికీ వెళ్లి వాటిని లబ్ధిదారులకు అందించాల్సి ఉండేది. 1వ తేదీ నుంచి 15 రోజులపాటు వాహనాలు తిరుగుతూ పంపిణీ చేయాల్సి ఉండేది. ఒకట్రెండు రోజులు తిరిగి ఆ తర్వాత వాహనాలు కనిపించకుండా పోయేవి. వాహన ఆపరేటర్లు వైసీపీ కార్యకర్తలు కావడంతో వాహనం తిప్పకపోయినా.. తిరిగినట్లు రికార్డులు చూపించి, నెలవారీగా డబ్బు విడుదల చేస్తూ ప్రభుత్వ సొమ్ముకు ఎసరు పెడుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇపుడు ఈ వాహనాలు రద్దు చేయడంతో ఒక్క అనంత జిల్లాలోనే నెలకు రూ.85 లక్షలకుపైగా సర్కారుపై భారం తగ్గనుంది.

షాపుల వద్దే పంపిణీ: వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

రేషన్ సరుకులను జూన్ ఒకటో తేదీ నుంచి షాపుల వద్దనే పంపిణీ చేస్తారు. 15వ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుంది. 65 ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి డీలర్లు రేషన్ సరుకులను పంపిణీ చేయాల్సి ఉంటుంది. పాత పద్ధతిలో డీలర్లు ఇక నుంచి రేషన్ పరుకులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశాం.

చాలా ఉపయుక్తం

'ఉపాధి'లో అక్రమాల నివారణకు యుక్తధార యాప్

పనిచేస్తున్న ఉపాధి కూలీలు



పైలెట్ ప్రాజెక్ట్‌గా 31 గ్రామ పంచాయతీల్లో అమలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యుక్తధార యాప్ ద్వారా ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పడనుంది. జిల్లాలోని 31మండలాల్లో 31గ్రామ పంచాయతీల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద యుక్తధార యాప్ ద్వారా పనులు పరిశీలించనున్నారు. సీనియర్ ఉపాధి కూలీలు, గ్రామ ప్రజలతో కలిసి ఏర్పాటు చేసిన గ్రామ కమిటీల సభల నిర్వహించేటప్పుడు పనుల జాబితాలను ప్రతిపాదించి తీర్మానం చేస్తారు. ఆ పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, బోగస్ మస్టర్లు లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పర్యవేక్షిస్తారు.

ఇలా కనిపెట్టేస్తుంది...యుక్తధార

ఉపాధి పనుల వివరాలను యుక్తధార యాప్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుంది. వాటి ఆధారంగానే బిల్లులు మంజూరవుతాయి. ఈ నేపథ్యంలో బోగస్ మస్టర్లు, చేసిన పనులనే మళ్లీ నమోదు చేసి అప్‌లోడ్ చేసేవారికి యుక్తధారా యాప్ ద్వారా చెక్ పెట్టనున్నారు. పనులను జనరేట్ చేసే ముందు రోజు ఎక్కడైతే జియోట్యాగ్ చేస్తారో మరుసటి రోజు అక్కడే పని చేయాల్సి ఉంటుంది. అక్కడ కాకుండా మరోచోట ఉపాధి పనులు చేయడాన్ని యుక్తధారా యాప్ స్వీకరించదు. అప్పటికే చేసిన పనులను తిరిగి చేయాలని చూసినా అటువంటి పనులను కూడా స్వీకరించదు. ఇలా డబుల్ మస్టర్లు, ఒకే ఫొటోను నాలుగైదు పనులకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి యత్నించినా ఈ యాప్ స్వీకరించదు. తద్వారా ఉపాధి నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయి.

పైలెట్ ప్రాజెక్ట్‌గా...

యుక్తధారను పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో 31గ్రామ పంచాయతీల్లో అమలు చేయనున్నారు. అనంతపురం రూరల్ మండలంలో మన్నీల గ్రామపంచాయతీ, ఆత్మకూరు (వడ్డుపల్లి), బెళుగుప్ప (ఆవులెన్న), బొమ్మనహాళ్ (లింగదహాళ్), బ్రహ్మసముద్రం (ముప్పులకుంట), బుక్కరాయసముద్రం (బుక్కరాయసముద్రం), డి.హీరేహాళ్ (పులకుర్తి), గార్లదిన్నె (కోటంక), గుత్తి (రజాపురం), గుమ్మఘట్ట (పూలకుంట), గుంతకల్లు (ఎన్ తిమ్మాపురం), కళ్యాణదుర్గం (మానిరేవు), కంబదూరు (కంబదూరు), కణేకల్లు (గోపులపురం), కూడేరు (కమ్మూరు), కుందుర్పి (అపిలేపల్లి), నార్పల (బొందలవాడ), పామిడి (రామగిరి), పెద్దపప్పూరు (గార్లదిన్నె), పెద్దవడుగూరు (పెద్దవడుగూరు), పుట్లూరు (జంగంరెడ్డిపేట), రాప్తాడు (పుల్లలరేవు), రాయదుర్గం (నాగిరెడ్డిపల్లి), శెట్టూరు (బొచ్చుపల్లి), శింగనమల (సోదనపల్లి), తాడిపత్రి (వెంకటరెడ్డి పల్లి), ఉరవకొండ (లత్తవరం), వజ్రకరూరు (చిన్నహోతూరు), విడపనకల్లు (కొట్టాలపల్లి), యాడికి (వేములపాడు), యల్లనూరు (జంగాలపల్లి) గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు.

94 పనుల గుర్తింపు: సలీంబాషా, డ్వామా పీడీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు యుక్తధారా యాప్‌ను తీసుకువచ్చారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 31మండలాల్లో 31గ్రామపంచాయతీలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో గ్రామ కమిటీల ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉపాధి పనుల్లో అక్రమాలకు తావు లేకుండా ఉండే పనులను గుర్తించి అమలు చేస్తారు. సీనియర్ ఉపాధి కూలీలతో టెక్నాలజీ పరికరాలను ఉపయోగించి 94 పనులను చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో తీవ్ర జాప్యం

● పెద్ద సంఖ్యలో దెబ్బతింటున్న వైనం
● నత్తనడకన రిపేర్లు
● రైతులు, వినియోగదారులకు తప్పని నిరీక్షణ

బళ్లారి రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రం



కాలిపోతే.. కష్టాలే..!

మరమ్మతులకు లోనైన ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు..

నెల	పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య
జనవరి	223
ఫిబ్రవరి	290
మార్చి	308
ఏప్రిల్	279
మే (ఇప్పటి వరకు)	873



అనంతపురంరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి):ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందంటే అంతే సంగతులు. ఎన్నాళ్లకు ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్ రీప్లేస్‌మెంట్ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురు చూడటమే రైతులు, వినియోగదారుల వంతవుతోంది. మరమ్మతు కేంద్రాల్లో ఆశించిన స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు పూర్తికాకపోవడం ఇందుకు కారణం. రోజుకు పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతుంటే.. రిపేరవుతున్న వాటిని వేళ్లమీద లెక్కబెట్టవచ్చు. గత ఐదు నెలల్లో జిల్లావ్యాప్తంగా 2 వేల వరకు మరమ్మతులకు గురైనవాటి లెక్కలను పరిశీలిస్తే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎన్నెన్నో కారణాలు

వేసవిలో లోఓల్టేజీ, హైఓల్టేజీ కారణాలతో ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోతున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులకు దెబ్బతింటున్నాయి. పదిరోజుల క్రితం కురిసిన వర్షాలకు రాప్తాడు మండలంలో మాత్రమే 20 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. శింగనమల, అనంతపురం రూరల్, విడపనకల్లు ప్రాంతాల్లో ఇదే స్థాయిలో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగిస్తుండటం కూడా ఇందుకు కారణమని తెలుస్తోంది. వాస్తవానికి ట్రాన్స్‌ఫార్మర్ కాలపరిమితి 25 ఏళ్లు అని సంబంధిత అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో గడువు తీరిపోయిన వాటిని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తరచూ మరమ్మతులకు వస్తున్నాయన్న వాదనలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

భారీగా మరమ్మతుల బారిన..

జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో (మిగతా 4వ పేజీలో)

నాణ్యతలో రాజీపడం

జేడీఏ ఉమామహేశ్వరమ్మ విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీ



అనంతపురంలో విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, మే 30(ఆంధ్రజ్యోతి): విత్తన వేరుశనగ నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ స్పష్టం చేశారు. అనంతపురం నగరంలోని విజయ ఆగ్రో సీడ్స్, నందీశ్వర ఆగ్రో ఏజెన్సీస్, వెంకటేశ్వర ట్రేడర్స్, బెళుగుప్పలోని వినాయక సీడ్స్ ఏజెన్సీల్లో విత్తన వేరుశనగ ప్రాసెసింగ్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తామని అన్నారు. ప్రాసెసింగ్ పక్కాగా చేయాలని, వేరుశనగ మొలక శాతాన్ని పరిశీలించి, నాణ్యమైన విత్తన కాయలను మాత్రమే పంపిణీ కేంద్రాలకు చేర్చాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం జిల్లాకు 50.592 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం మంజూరు చేసిందని తెలిపారు. వీటితోపాటు కందులు, వరి, కొర్రలు, పెసర, అలసంద, పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీతో అందిస్తామని తెలిపారు. ఇప్పటికే 108 రైతు సేవా కేంద్రాలలో 18 వేల క్వింటాళ్ల విత్తనం అందుబాటులో ఉంచామని, అవసరమైన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తనిఖీలలో టెక్నికల్ ఏవో రాకేష్ నాయక్, బెళుగుప్ప ఏవో పృథ్వీసాగర్, అనంతపురం ఏడీఏ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు జల్లులుపడే అవకాశం

అనంతపురం అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం చిరుజల్లులు పడే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.0-36.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.0-25.4 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. నైరుతి దిశగా గాలులు గంటకు 12-15 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని అన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 63-78 శాతం, మధ్యాహ్నం 35-60 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఒక్క రోజు ముందే..!

నేడు పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ ఒక రోజు ముందే చేపడుతున్నారు. జూన్ ఒకటో తేదీన ఆదివారం కావడంతో శనివారమే పింఛన్ సొమ్ము ఇచ్చేయాలని నిర్ణయించారు. గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇంటివద్దకు ఉదయం 7 గంటలకు నుంచి వచ్చి సొమ్ము అందజేస్తారని డీఆర్‌డీఏ పీడీ శైలజ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 2,80,247 మంది లబ్ధిదారులకు రూ.124.96 కోట్లు మంజూరైంది. 1,36,296 మంది వృద్ధులకు రూ.55.36 కోట్లు, 67,212 మంది వితంతువులకు రూ.27.47 కోట్లు, 6,496 మంది చేనేతలకు రూ.2.62 కోట్లు, 343 మంది కల్లుగీత కార్మికులకు రూ.13.80 లక్షలు, 869 మంది మత్స్యకారులకు రూ.35 లక్షలు,



6,663 మంది ఒంటరి మహిళలకు రూ.2.70 కోట్లు, 3,443 మంది సఫాయి కర్మాచారులకు రూ.1.38 కోట్లు, 200 మంది హిజ్రాలకు రూ.89 వేలు, 2,413 మంది హెచ్ఐవీ బాధితులకు రూ.96 లక్షలు, 3,057 మందికి డప్పు కళాకారులకు రూ.1.22 కోట్లు, 177 మంది కళాకారులకు రూ.71 వేలు, 45,394 మంది దివ్యాంగులకు రూ.27.69 కోట్లు, 376 మంది కుష్ఠు బాధితులకు రూ.22 లక్షలు, మంచానికి పరిమితమైన 1,399 మందికి రూ.2.11 కోట్లు, ప్రమాద బాధితులు 1,053 మందికి రూ.1.58 కోట్లు, అభయహస్తం కింద 4,136 మందికి రూ.21 లక్షలు, ఇతర లబ్ధిదారులతో కలిపి మొత్తం 2,80,247 మందికి రూ.124.96 కోట్లు అందజేస్తారు. తొలిరోజు సాంకేతిక సమస్యలు తలెత్తితే.. మరుసటి రోజు పింఛన్ సొమ్ము అందజేస్తారు.

మహానాడు గ్రాండ్ సక్సెస్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



అనంతపురం అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన టీడీపీ మహానాడు గ్రాండ్ సక్సెస్ అయ్యిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. మహానాడును విజయవంతం చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 13 కమిటీల సభ్యులు సమన్వయంతో పనిచేసి మహానాడును దిగ్విజయం చేశారని న్నారు. మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ఆరు శాసనాలే మార్గదర్శక సూత్రాలని, భవిష్యత్తులో ఉమ్మడి కడప జిల్లాలో జగన్ డ్రామాలు సాగవని పేర్కొన్నారు. మహానాడు విజయవంతం కావడంతో వైసీపీ నేతలకు మైండ్ బ్లాక్ అయిందని అన్నారు. రాయలసీమకు ఏం చేశారని ప్రశ్నించడం వైసీపీ నాయకులకు పరిపాటిగా మారిందని విమర్శించారు. వైసీపీ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల గురించి ఆలోచించనివారికి ప్రశ్నించే హక్కు లేదని అన్నారు. సీఎం చంద్రబాబు సాగునీటి ప్రాజక్టులను పూర్తి చేసి, రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎనిమిది ఎకరాలు తీసుకున్నారు



జిల్లేడుబండ రిజర్వాయర్‌కు మా భూమి 8 ఎకరాలు తీసుకున్నారు. వేరుశనగ, టమోటా, పూలమొక్కలు, ఇతర పంటలు సాగు చేసేవాళ్లం. వైసీపీ ప్రభుత్వంలో జిల్లేడుబండ ముంపు రైతులకు పరిహారం అందించకుండా డ్యామ్ పనులు మొదలు పెట్టారు. నా పొలం వద్దే కరకట్టకు సర్వే చేశారు. పంటలు సాగు చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నాం.

- గుర్రం చంద్ర, పొడరాళ్లపల్లి రైతు



పనులు నిలిపివేయడంతో పెరిగిన జిల్లేడు మొక్కలు

● జిల్లేడుబండ ప్రాజెక్టుకు 2700 ఎకరాల సేకరణ
● రైతులకు పైసా కూడా చెల్లించని ప్రభుత్వం
● బిల్లులు రాక పనులు ఆపేసిన కాంట్రాక్టర్
● ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పరిహారం అందేనా?

జిల్లేడుబండే..?

ముదిగుబ్బ, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు పనులు ప్రారంభమై సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం ప్రకటించడంలేదు. దీంతో జీవనాధారమైన భూములు కోల్పోయి, పరిహారం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులను ఐదేళ్ల కిందట ప్రారంభించారు. ఇందుకోసం ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల్లో రైతుల నుంచి 2500 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 700 ఎకరాలు జలాశయానికి కేటాయించగా మిగిలిన 1800 ఎకరాలు ముంపు కింద కోల్పోతున్నారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం బాధితులకు ఎటువంటి పరిహారం ప్రకటించలేదు.

అర టీఎంసీ నుంచి 2.41కి పెంపు

ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లి తండా గ్రామ సమీపాన అర టీఎంసీ సామర్థ్యంతో జిల్లేడుబండ రిజర్వాయర్‌కు 2005-06లో శంకుస్థాపన చేశారు. ఇందుకోసం దాదాపు 300 ఎకరాలు అవసరమని భూ సర్వే నిర్వహించారు. ఆ తర్వాత ఎలాంటి పనులు ముందుకు సాగలేదు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు సామర్థ్యాన్ని 2.41 టీఎంసీలకు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 2700 ఎకరాలు భూమి సేకరించారు. ఈనేపథ్యంలో ప్రాజెక్టు పనుల కోసం 2020 సెప్టెంబరు 22న ప్రభుత్వం రూ.680 కోట్ల నిధులు జారీ చేసింది. ఈ రిజర్వాయర్‌కు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు తరలించనున్నారు. ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని పలు మండలాలకు సాగునీరు అందించాలని

(మిగతా 4వ పేజీలో...)

మూసేసుకున్నారు..!

హైవేలపై వంతెనల మూత
వర్షపు నీరు వెళ్లకుండా అడ్డంకులు
పట్టించుకోని అధికారులు

కురుగుంట వద్ద హైవే రోడ్డు బ్రిడ్జిని మూసినవేసిన కేఫ్ నిర్వాహకులు



● ఇక్కడ కనిపిస్తున్న చిత్రం అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోనిది. అనంతపురం - కళ్యాణదుర్గం ప్రధాన హైవే. రోడ్డు నిర్మాణ క్రమంలో స్థానికంగా చిన్నపాటి వంతెన ఏర్పాటు చేశారు. వర్షాలు కురిసిన సమయంలో.. చుట్టుపక్కల ఉన్న పొలాల్లోని నీరు, రోడ్డుపై పడిన వర్షపు నీరు వంతెనా గుండా వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. స్థానికంగా హైవేకు పక్కనే కురుగుంట గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు టీ కేఫ్ ఏర్పాటు చేశాడు. అందులో భాగంగా హైవేకు సంబంధించిన వంతెనను ఓ వైపు పూర్తిగా మూసేశాడు. ఇది జరిగి కూడా ఏడాది కావస్తోంది.

అనంతపురం రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులకు అనుబంధంగా ఏర్పాటు చేసిన వంతెనలను ప్రైవేటు వ్యక్తులు మూసేస్తున్నా.. సంబంధిత అధికారులు కళ్లు మూసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారుల్లో నీటి ప్రవాహాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కడికక్కడ చిన్న..పెద్ద తరహా వంతెనలను ఏర్పాటు చేశారు. ఈ వంతెనలను కొంత మంది స్వార్థపరులు తమ వ్యాపార సముదాల కోసం మూసేస్తున్నారు. తద్వారా నీటి ప్రవాహాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇందుకు పై ఉదాహరణలే నిదర్శం. ఇంత జరుగుతున్నా సంబంధింత అధికారులు అటువైపు (మిగతా 4లో...)

ఛీ.. ఛీ..! ● అధ్వానంగా బస్టాండ్లు ● కనీస సౌకర్యాలు కరువు

4 43 పోస్టులకు 1804 దరఖాస్తులు ● వైద్యవిధాన పరిషత్‌లో పోస్టులకు పోటాపోటీ ● మొదలైన పైరవీలు.. రంగంలోకి దళారీలు



కొట్టు, ఆ పక్కనే చిన్న గది కనిపిస్తున్నాయి. వాటి వెనకాలే కనీ కనిపించకుండా ఓ నిర్మాణం ఉంది. అదే.. బస్సు షెల్టర్. ఆర్టీసీ అర్థంలేని చర్యలకు ఇది నిదర్శనం. ప్రయాణికులకు అనువుగాని చోట బస్సు షెల్టర్ నిర్మించారు. అందులోకి ఎవరూ వెళ్లట్లేదు. ఇక.. అడిగేవారు లేరన్న ధీమాతో బస్సు షెల్టర్ కనిపించకుండా ఏకంగా ముందుకు కొట్టు, గది కట్టేసుకున్నారు. కొంతదూరంలో ప్రయాణికులు ఎండలో ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.



అదిగదిగో.. సందులో దూరంగా సగం పూర్తయిన భవనం చూశారా.. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా అది బస్సు షెల్టరే. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు క్రాస్‌లో నిర్మాణం చేపట్టారు. షెల్టర్ ముందు దేవాలయం, గుడిసె ఉంది. అనువుగాని చోట బస్సు షెల్టర్ నిర్మించడంతో ప్రయాణికులు అక్కడికి వెళ్లలేక చెట్టు నీడనే బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు.



కట్టెలు, పాత బంకును చూసి కట్టెల డిపో అనుకుంటే పొరబడినట్లే. ఇది బస్సు షెల్టర్. బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్ క్రాస్‌లో దాతల సాయంతో దీనిని నిర్మించారు. ఉపయోగంలో లేక పోవడంతో అక్కడ కట్టెలు వేశారు. ప్రయాణికులు దుకాణాలు, హోటళ్ల ముందు వేచిఉంటూ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.

ఉన్నా.. లేనట్లే..!

అనువుగాని చోట బస్సు షెల్టర్ల నిర్మాణం

బస్సులు ఆగేదొకచోట.. షెల్టర్ మరోచోట..

ఎండ, వర్షంలో ప్రయాణికుల తిప్పలు

బొమ్మనహాళ్, మే 30(ఆంధ్రజ్యోతి): అధికారుల అనాలోచితంగా, అనువుగానిచోట బస్సు షెల్టర్లు నిర్మించడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. బస్సులు ఆగేదొకచోట.. షెల్టర్ మరోచోట ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండయినా.. వర్షం వచ్చినా.. అక్కడే అవస్థలు పడుతూ నిరీక్షిస్తున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల మీదుగా కళ్యాణదుర్గం-బళ్లారి అంతర్రాష్ట్ర రహదారి వెళ్తుంది. రహదారి పక్కన ఉండే గ్రామాల్లో బస్సు షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలోని ఉంతకల్లు క్రాస్, ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ క్రాస్ గ్రామాల్లోని బస్సు షెల్టర్లను అనువుగాని చోట్ల నిర్మించారు. అక్కడికి దూరంలో బస్సుల కోసం ప్రయాణికులు ఎండకి ఎండుతూ.. వర్షంలో తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారుల తీరుతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఛీ.. ఛీ..!



పామిడి బస్టాండుకు కాంపౌండు లేక పేరుకు పోయిన చెత్త

- అధ్వానంగా బస్టాండ్లు
- కనీస సౌకర్యాలు కరువు
- పెచ్చులూడుతున్న పైకప్పులు
- మరుగుదొడ్లలో నీరు కూడా ఉంచని దుస్థితి
- తాండవిస్తున్న అపరిశుభ్రత
- ఏమాత్రం పట్టించుకోని యాజమాన్యం



గుంతకల్లు బస్టాండులో పనిచేయని తాగునీటి ట్యాంక్



దిష్టిబొమ్మల్లా మరుగుదొడ్లు

గుంతకల్లు ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన మూత్రశాల, మరుగుదొడ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మూత్రశాలలను సక్రమంగా నిర్వహించని కారణంగా వాటిని ప్రయాణికులు ఉపయోగించడంలేదు. మంచి నీటి ట్యాంకు పనిచేయడం లేదు. బస్టాండు ముందర బురద, నీరు నిల్వ ఉంటోంది. సమస్యలు కనబడుతున్నా ఆర్టీసీ అధికారులు బస్టాండులో వసతులు, పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు. బెంగళూరు, తిరపతి, నెల్లూరు, విజయవాడకు వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకునే కౌంటర్ కొద్ది రోజులుగా మూతపడింది.

గుంతకల్లు నెట్‌వర్క్, మే 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్లు అధ్వానంగా ఉంటున్నాయి. కనీస పరిశుభ్రత లేకుండా.. ఆర్టీసీ బస్టాండ్లను నిర్వహిస్తున్నారు. బస్టాండ్లలో కొంచెం స్థలం దొరికితేచాలు దానిని వ్యాపార అవసరాలకు లీజుకు ఇచ్చి డబ్బు ఆర్జించాలన్న ఆలోచన తప్ప.. అది ప్రజోపయోగ స్థలమనీ, దానిని సక్రమంగా నిర్వహించాలన్న ఆలోచన యాజమాన్యానికి ఏమాత్రం లేకుండాపోయింది. బస్టాండ్లలోకి వస్తే ఏదో ఒక అనారోగ్యం సంక్రమించేంత అధ్వానస్థాయిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. కొన్ని బస్టాండ్లలో కనీసం మూత్రశాలలు కూడా లేవు. బస్సు ప్రాంగణాలు శిథిలావస్థకు చేరుకుని ప్రయాణికుల నెత్తిపై పెచ్చులెప్పుడు పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. తాగునీరే కాదు, చేతులు కడుక్కోవడానికి కూడా నీటి వసతి కల్పించడంలేదు. కొళాయిలున్నా అందులో నీరు రావడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు.



గుత్తి బస్టాండులో శిథిలావస్థకు చేరిన పైకప్పు

గుత్తిలో..

ఆర్టీసీ బస్టాండు పైకప్పు శిథిలావస్థకు చేరుకుంది. మరుగుదొడ్ల గదుల పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందోనన్న భయం కలిగిస్తోంది. అయినా.. వాటిని వినియోగించినందుకు ప్రయాణికుల నుంచి ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారు. పురుషుల మూత్రశాల కాలుపెట్టడానికి కూడా వీల్లేనంతగా జుగుప్సాకరంగా ఉంటుంది. అందులో ఒక్క కొళాయి కూడా ఏర్పాటు చేయలేదు. మూత్రశాలలో ఏర్పాటుచేసిన బండలు వదులైపోవడంతో కొన్నింటిని పక్కనపెట్టారు. అందులోని కాలువ సీజ్ అయిపోయి పరిశుభ్రత అనేది లేకుండాపోయింది. ప్రభుత్వం స్వచ్ఛభారత్ కింద నిర్మించిన మూత్రశాలలు మరీ అధ్వానంగా ఉన్నాయి. వీటిని పట్టించుకునే నాథుడేలేడు. తాగునీటి సౌకర్యం సక్రమంగా లేదు. నైట్ సర్వీస్ బస్సులు హైవేలో వెళ్తుండడంతో రాత్రిపూట ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండులో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.



పామిడి బస్టాండులో శిథిలావస్థలో మరుగుదొడ్లు

పామిడిలో..

బస్టాండు శిథిలావస్థకు చేరుకుంది. మరుగుదొడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. బస్టాండు ప్రాంగణం అపరిశుభ్రతకు నిలయమైంది. ప్లాట్ ఫాంలు దెబ్బతిన్నాయి. బస్టాండు కాస్తా.. కారు స్టాండుగా మారిపోయింది. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసమవుతోంది. ఆర్టీసీ స్థలాన్ని కొందరు కబ్జాచేసి షాపులను ఏర్పాటుచేసుకునే యత్నంలో ఉన్నారు. ప్రహరీ నిర్మించి, ఆర్టీసీ బస్టాండును సక్రమంగా నిర్వహిస్తే తప్ప.. ప్రయాణికులు లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఉరవకొండలో..

బస్టాండులో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిపో నుంచి 52 సర్వీసులు నడుస్తున్నాయి. నిత్యం 20 వేల మందిదాకా రాకపోకలు సాగిస్తున్నారు. బస్టాండులో తాగునీటి కొళాయి ఉన్నా, నీటి ట్యాంకును శుభ్రంచేయలేదు. దీంతో నీరు అపరిశుభ్రంగా సరఫరా అవుతోంది. ఆ నీటిని తాగడానికి ప్రయాణికులు ఇష్టపడడంలేదు. బస్టాండు ప్రాంగణంలో తాత్కాలికంగా కుండలను ఏర్పాటు చేసి ప్రయాణికులకు నీటిని అందిస్తున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ కారణంగా మూత్ర విసర్జనకు పక్కనే ఉన్న స్కూటర్ స్టాండుకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్తున్నారు. ప్రయాణికులకు అవసరమైన కుర్చీలు కూడా అందుబాటులో లేవు. మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జిల్లేడుబండే..?

(3వ పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.

ముంపు ప్రాంతాలివే...

బుక్కపట్నం, ముదిగుబ్బ మండలాల్లోని ఐదు రెవెన్యూ గ్రామాల పరిధిలో భూములు మునిగిపోతున్నాయి. రామసాగరం పూర్తిగా మునుగుతుంది. గోపాలపురం గ్రామ సమీపం వరకు మునిగే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. పొడరాళ్లపల్లి, ఛాగాపురం, మంగళమడక, గుంజేపల్లి గ్రామ పొలాలు ముంపు బారిన పడనున్నాయి. రైతులు లక్షలు వెచ్చించి సాగు చేసిన మామిడి, జామ, చీనీ తదితర పండ్ల తోటలను కోల్పోవాల్సి వస్తోంది. దీంతో కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. ఎకరాకు రూ.25 లక్షలైనా పరిహారం ఇవ్వాలని జిల్లేడుబండ ముంపు రైతులు కోరుతున్నారు.

ఎంత పరిహారమో చెప్పలేదు

జిల్లేడుబండ రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం అందజేయడంలో గత వైసీపీ ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. జలాశయ నిర్మాణ పనులు చేపట్టాలంటే ముందుగా సేకరించిన భూమికి సంబంధించిన రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. రైతుల అంగీకారం తరువాతే పనులు మొదలు పెట్టాలి. అయితే అప్పటి ధర్మవరం, పుట్టపర్తి వైసీపీ ఎమ్మెల్యేలు రైతులకు జిల్లేడుబండపై గొప్పలు చెప్పారే తప్ప, ముంపు బాధితులకు ఎంత పరిహారం ఇస్తారో చెప్పలేదనే విమర్శలు గట్టిగానే వినిపించాయి.

గ్రామసభలు నిర్వహించకుండానే గత వైసీపీ ప్రభుత్వం నేరుగా రిజర్వాయర్ నిర్మాణం పనులు చేపట్టింది. ఇప్పటికే దాదాపు 40 శాతం పనులు కూడా పూర్తయ్యాయని, రూ.180 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్‌కు మంజూరు కాకపోవడంతో 2023 నవంబరులో పనులు ఆపేశారు. పనులు ఆపివేయడంతో ప్రాజెక్టులో జిల్లేడు మొక్కలు, కంపచెట్లు పెరిగాయి. గత వైసీపీ ప్రభుత్వం జిల్లెడుబండ ప్రాజెక్టు కోసం భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందించకుండా మోసం చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడైనా పరిహారం అందేనా?

ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు జిల్లేడుబండపై సమావేశం ఏర్పాటు చేసి, అధికారంలోకి రాగానే రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామని ముంపు బాధితలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంకా పరిహారం ఊసెత్తలేదు. గ్రామసభలు నిర్వహించి రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని ముంపు బాధితులు కోరుతున్నారు.

పంటలు సాగు చేయలేకున్నాం



జిల్లేడుబండ రిజర్వాయర్‌కు మాది మూడు ఎకరాల పొలం తీసుకున్నారు. మామిడి తోట, వేరుశనగ, మిరప, బంతిపూలు, ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 240 మామిడి చెట్లు ముంపునకు గురవుతున్నాయి. తోటలో కరకట్ట నిర్మిస్తామని అధికారులు సర్వే చేశారు. పంట సాగు చేస్తే ముంపునకు గురవుతుందేమోనని ఆందోళనతో రెండేళ్లుగా పంటలు సాగు చేయకుండా ఇతర పనులు చేసుకుంటున్నాం.

- హేమేంద్ర, గుంజేపల్లి పొలం రైతు

ప్రతిపాదనలు పంపాం

జిల్లేడుబండ రిజర్వాయర్ ముంపు బాధితుల పరిహారం విషయంలో పైస్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపాం. ముంపు బాధితులకు పరిహారం, కాంట్రాక్టర్‌కు ఇది వరకు చేసిన పనులకు బిల్లులు అందిన వెంటనే మిగిలిన పనులు చేపడతాం.

- వేణుగోపాల్‌రెడ్డి, డీఈఈ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ పెనుకొండ

43 పోస్టులకు 1804 దరఖాస్తులు

- వైద్యవిధాన పరిషత్‌లో పోస్టులకు పోటాపోటీ
- మొదలైన పైరవీలు.. రంగంలోకి దళారీలు

అనంతపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యవిధాన పరిషత్ పరిధిలో వివిధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. మొత్తం 43పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరించారు. గడువు ముగియడంతో వచ్చిన దరఖాస్తులను లెక్కించి, స్క్రూట్నీ ప్రక్రియను శుక్రవారం మొదలు పెట్టారు. మొత్తం 1804 దరఖాస్తులు వచ్చినట్లు తేల్చారు. ఇందులో 04ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులకు 293, 03 ఆఫీస్ సబార్డినేటర్ పోస్టులకు 266, 22 జనరల్ డ్యూటీ అటెండెన్స్ పోస్టులకు 832, 02 రికార్డు అసిస్టెంట్ పోస్టులకు 191 దరఖాస్తులు వచ్చాయని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ తెలిపారు. ఈనాలుగు కేటగిరీ పోస్టులకు 1582 దరఖాస్తులు వచ్చాయన్నారు. మిగిలిన బయోమెడికల్ ఇంజనీర్, రేడియోగ్రాఫర్, పిజియోథెరపిస్టు, ఆపరేషన్ థియేటర్, పోస్టుమార్టమ్ అసిస్టెంట్, ప్లంబర్ పోస్టులకు అన్నింటికి కలిపి కేవలం 222 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని డీసీహెచ్‌ఎస్ తెలిపారు. అన్నిపోస్టులకు కలిసి 155 మంది పీహెచ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. పోటీ అధికంగా ఉండటంతో ఆశావహులు పైరవీలు మొదలు పెటారు. కొందరు దళారీలు రంగంలోకి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరికొందరు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు ఇప్పిస్తున్నారని తెలిసింది.



దరఖాస్తులు అందజేస్తున్న అభ్యర్థులు

మెరిట్‌కే ప్రాధాన్యం



దరఖాస్తులు స్వీకరణ ముగియడంతో పరిశీలన చేపడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అనర్హులుగా గుర్తిస్తాం. మిగిలిన వాటిలో మెరిట్‌కే ప్రాధాన్యం ఇచ్చి అభ్యర్థులను ఎంపిక చేస్తాం. ఆ జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి కలెక్టరుకు పంపి అక్కడ ఆమోదం తీసుకుంటాం. ఎవరూ దళారీలను నమ్మి మోసపోకండి. అంతా ప్రతిభకే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ రవికుమార్, డీసీహెచ్‌ఎస్

కాలిపోతే.. కష్టాలే..!

(3వ పేజీ తరువాయి)

ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుల బారిన పడుతున్నాయి. గత ఐదు నెలల్లో వెయ్యికిపైగా ట్రాన్స్‌ఫార్మర్లు పాడైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,973 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు వచ్చాయి. మే నెలలోనే 8,73 మరమ్మతులకు లోనయ్యాయి. అదేస్థాయిలో మరమ్మతులు పూర్తికాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 10 ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాలున్నాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు రెండు చొప్పున పూర్తయినా కొంత ఊరటగా ఉంటుంది. రోజుకు పదిహేనుకు మించి కాకపోవడం సమస్యలకు కారణమవుతోంది.

తప్పని కష్టాలు..

ఆశించిన స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల ప్రక్రియ పూర్తికాపోవడంతో క్షేత్రస్థాయిలో రైతులు, వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. క్షేత్రస్థాయిలోని విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో అవస్థలు తప్పడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటే సంబంధిత అధికారుల తెలియజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనంతపురం రూరల్ మండల పరిధిలో పదిరోజుల క్రితం ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోతే 48 గంటల్లో మార్పు చేయాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో అయితే 24 గంటల్లో మార్చాలి. అది చాలావరకు అమలు కావడంలేదు. ఎంతలేదన్నా.. మూడు, నాలుగురోజుల సమయం పడుతోంది. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్ రీప్లేస్‌మెంట్ కోసం రైతులు, వినియోగదారుల రోజులకొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది.

రోజూ 15దాకా మరమ్మతులు

జిల్లాలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాల్లో రోజూ 15 వరకు మరమ్మతులు పూర్తవుతున్నాయి. ఇటీవల వర్షాలకు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలోనే కొన్ని సమస్యలు వచ్చాయి. వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటాం.

- రవిశంకర్, ఈఈ, ట్రాన్స్‌ఫార్మర్ల విభాగం

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు



ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా 173 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. వీటిలో ఇటీవల 40 కేటాయించాం. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైన వెంటనే రైతులు, వినియోగదారులు.. అధికారుల దృష్టికి తీసుకొస్తే.. నిర్దేశిత సమయంలో వాటిని మార్పు చేస్తాం. క్షేత్రస్థాయి సిబ్బందికి తెలపడంలో జాప్యం, ఇతరత్రా కారణాలతో వాటి నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. 1912 టోల్ ఫ్రీ ద్వారా రైతులే సమస్యను తెలియజేసే అవకాశం ఉంది. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

- శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ, అనంతపురం జిల్లా

మూసేసుకున్నారు..!

(3వ పేజీ తరువాయి)

కన్నెత్తి చూడటం లేదు. కనీస పర్యవేక్షణ మరిచిపోయారు. ఫలితంగా ఎవరికి వారు హైవేలకు ఆనుకుని ఉన్న తమ స్థలాల వద్ద ఇళ్ల నిర్మాణాలు, ఇతర సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అడ్డుగా ఉంటున్న వంతెనలను కనుమరుగయ్యేలా చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

ఇళ్ల నిర్మాణాలు, భవనాలు, వ్యాపార సముదాయల నిర్మాణ క్రమంలో హైవేల్లో వంతెనలను మూసివేస్తున్నారు. ఇలా మూసి వేయడం వల్ల భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాలతో కలిగే నష్టాలను గుర్తించడం లేదు. కక్కలపల్లి క్రాస్‌లోని వంతెన మూసి వేయడంతో ఇటీవల కురిసిన మోస్తారు వర్షానికి నీరంతా ప్రధాన హైవేపై చేరింది. సర్వీసు రోడ్డుపైకి మురుగునీరంతా వచ్చింది. దీని వల్ల సర్వీసు రోడ్డులో ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలిగింది. హైవేపై వేగంగా వచ్చే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొన్నిచోట్ల వంతెనల కింద పేరుకుపోయిన చెత్తదారంతోనే నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తి చుట్టుపక్కల కాలనీలు నీటమునుగుతున్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ చూస్తున్నా..సంబంధిత అధికారులకు కనువిప్పు కలగలేదు.

పర్యవేక్షణ ఏదీ..?

హైవేల నిర్మాణంతోనే తమ పనైపోయినట్లు సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నార్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాటిని కనీసం పర్యవేక్షించడం లేదని వీటిని బట్టి తెలుస్తోంది. అధికారులు పర్యవేక్షణ చేసి ఉంటే మూసివేసిన వంతెనలు కనిపించేవి. వాటిని యథాస్థితికి తీసుకొచ్చే అవకాశం ఉండేది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేలుకుంటే భవిష్యత్తులో జరిగే నష్టాలను అరికట్టేందుకు వీలుంటుంది.



- ఈ చిత్రం అనంతపురంరూరల్ మండలం కక్కలపల్లి క్రాస్‌లోనిది. బెంగళూరు-హైదరాబాదు నేషనల్ హైవే ఏర్పాటు నేపథ్యంలో స్థానికంగా నీటి రాకపోకలకు వంతెన నిర్మించారు. హైవే సర్వీసు రోడ్డుకు ఉన్న ఓ పంక్షన్ హాల్ నిర్వాహకులు ఆ వంతెనను తమ వైపు ఇటీవల పూడ్చేశారు. దీంతో హైవే అటు వైపు ఉండే ఇళ్లు, ఇతరత్రా వాటిని నుంచి వచ్చే మురుగు నీరు వెళ్లేందుకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి వర్షపు నీరు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తడంతో కొంత కాలువ మాదిరి ఏర్పాటు చేశారు. సహజసిద్ధంగా నీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇలాంటివి చాలా చోట్ల జరుగుతూనే ఉన్నాయి. బహిరంగంగా ఆక్రమణలు కళ్లకు కనిపిస్తున్నా.. అధికారుల్లో మాత్రం చలనం కనిపించలేదు.

అపూర్వ సహోదరులు..!

- విగ్రహాల తయారీలో రాణిస్తున్న అన్నదమ్ములు
- అగళి కళాకారుల నైపుణ్యానికి పలువురి ప్రశంసలు



పంచలోహాలతో తయారు చేసిన శివుడి విగ్రహాల వద్ద దేవరాజాచారి, విశ్వమూర్తి

అగళి, మే 30(ఆంధ్రజ్యోతి): దేవతా ఉత్సవ విగ్రహాల తయారీలో అందెవేసిన చేయి ఆ సోదరులది. జీవకళ ఉట్టిపడేటట్లుగా విగ్రహాలు తయారు చేయడం వీరి ప్రత్యేకత. శిల్ప, చిత్రకళా రంగాల్లో రాణిస్తూ పదుగురి చేత ప్రశంసలు పొందుతున్న ఆ అన్నదమ్ములే మండల కేంద్రానికి చెందిన దేవరాజాచారి, విశ్వమూర్తిచారి. తండ్రి శ్రీరంగ నుంచి వీరికి ఈ శిల్పకళ వారసత్వంగా అబ్బింది. దీంతో చిన్నప్పటి నుంచే చదువుతో పాటు శిల్పాలు తయారు చేయడాన్ని నేర్చుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన ఆలయ కమిటీల ఆర్డర్లపై అనేక ఉత్సవ విగ్రహాలు తయారు చేసి ఇచ్చారు. బంగారం, వెండి, పంచ లోహాలతో ప్రభావళి, బసవన్న, శివుడు, లక్ష్మీదేవి, మారెమ్మ, ఆంజనేయస్వామి, నరసింహస్వామి, తదితర ఉత్సవ విగ్రహాలు అద్భుతంగా తయారు చేసి ప్రశంసలు పొందారు. లేపాక్షిలో కూడా శిల్పాలకు రంగులతోపాటు వివిధ అలంకరణలు చేపట్టారు. వీరి పనితనాన్ని మెచ్చిన బీజేపీ ఎమ్మెల్యే బంగారు లక్ష్మణ్ హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన ఈ అపూర్వ సహోదరులు తమ కళా నైపుణ్యంతో వివిధ ప్రాంతాల్లో పలువురి సత్కారాలు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్ర, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులు

సీతారామచంద్రుడికి అభిషేకం

గుంతకల్లు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా శుక్రవారం సీతారామ చంద్ర ఆంజనేయ స్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. యాగశాలలో ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

ట్రోలింగ్ దుర్మార్గం: రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

గుంతకల్లు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో సైనికాధికారుల కుటుంబ సభ్యులను సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 'పెహల్గాం ఉగ్రవాదుల దాడి-తదనంతరం పరిణామాలు' అనే అంశంపై శుక్రవారం సదస్సును నిర్వహించారు. ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమైక్యతా భావం వెల్లివిరిసిందని అన్నారు. అమెరికా ఆదేశాలతో కాల్పుల విరమణ, తదనంతరం జరిగిన సంఘటనలు మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయని అన్నారు. కొన్ని మూకలు సైనికాధికారుల కుటుంబసభ్యులను ట్రోలింగ్ చేయడం సమైక్యతకు సవాలుగా మారిందని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ మౌన మునిగా మారిపోవడం ఆందోళనకరమని అన్నారు. కేంద్రానికి మద్దతు ఇస్తున్న టీడీపీ, జనసేన ఈ ట్రోలింగ్‌ను ఖండించలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు సురేష్, సీపీఐ నాయకుడు సురేష్, విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణనాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాం క్రస్ట్‌గేట్‌ల తయారీకి నాలుగు కంపెనీల బిడ్

బళ్లారి, మే 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్ల తయారీకి ఈ-టెండర్‌లో నాలుగు కంపెనీలు బిడ్ వేశాయి. పనులు చేసేందుకు వీటికి అర్హత ఉందా లేదా అన్న విషయాన్ని జూన్ నాలుగు లేదా ఐదో తేదీన అధికారులు నిర్ధారించనున్నారు. ఇంతకు ముునుపు ఈ-టెండర్‌లో బిడ్ వేసిన కంపెనీల్లో మూడింటికి అనుభవం లేదని, మరో కంపెనీ తన అనుభవాన్ని పొందుపరలేదని తిరస్కరించారు. తాజాగా పిలిచిన రీ టెండర్‌లో నాలుగు కంపెనీలు బిడ్ వేశాయి. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్ గేట్లు ఉండగా, 19వ క్రస్ట్‌గేట్ మినహా 32 క్రస్ట్‌గేట్‌ల ఏర్పాటుకు రూ.60 కోట్లతో టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. 19వ క్రస్ట్‌గేటు ఏర్పాటు పనులను గుజరాత్‌కు చెందిన ఓ కంపెనీకి అప్పగించారు. ప్రస్తుతం పశ్చిమ కనుమల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. డ్యాంకు వరద మొదలైంది. ప్రస్తుతం 1000 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఈ కారణంగా ఈ ఏడాది 19వ గేటు ఏర్పాటు కూడా సాధ్యం కాకపోవచ్చని అధికారులు అంటున్నారు.

ఏసీ బోగీలో అనుమానితుడు

పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు



గుత్తిపోర్ట్ రైల్వేస్టేషన్‌లో జయరాజ్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

గుత్తి, మే 30(ఆంధ్రజ్యోతి): ఏసీ బోగిలో అనుమానాస్పదంగా కనిపించిన నంద్యాల జిల్లాకు చెందిన జయరాజ్ అనే వ్యక్తిని రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇతను రైళ్లలో చోరీకి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన గాలిపోతుల జయరాజ్ అలియాస్ దేవరాజ్.. మచిలీపట్నం నుంచి ధర్మవరంకు వెళ్లే రైలులో ఏ1 ఏసీ బోగిలో అనుమానస్పదంగా కనిపించాడు. దీంతో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది అదుపులోకి తీసుకుని, రైల్వే హెల్ప్ లైన్‌కు సమాచారం అందించారు. రైలు గుత్తి పోర్ట్ రైల్వే స్టేషన్‌కు రాగానే అతన్ని గుత్తి రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్నుంచి ఒక సెల్‌ఫోన్, రెండు తులాల బంగారు తాళిబొట్టు చైన్, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు.

అదే కావాలి..!

ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలోనే పోస్టింగ్ కావాలి
ఆర్అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో వద్దు
ధర్మవరం బదిలీ చేసినా ఓడీపై ఇక్కడికే రాక
సీటు పదిలం కోసం 5 సిఫార్సు లెటర్లు
హాట్‌సీట్‌గా ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పోస్టు



అనంతపురం న్యూటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ పోస్టు హాట్ సీట్‌గా మారింది. ఈ సీట్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఓ ఉద్యోగి తప్పనిసరి బదిలీల్లో భాగంగా ధర్మవరం వెళ్లాడు. అయితే తన పలుకుబడిని ఉపయోగించి ఓడీపై తిరిగి వచ్చాడు. వేతనం ధర్మవరంలో తీసుకుంటూ ఉద్యోగం అనంతపురం ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో నిర్వహిస్తున్నాడు. అనంతపురంలో విధులు నిర్వర్తించాల్సిన వ్యక్తి మాత్రం ఓడీపై ధర్మవరంలో పని చేస్తున్నాడు. ప్రస్తుత బదిలీల్లో అనంతపురం ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో వేతనం తీసుకుంటూ ధర్మవరంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ గోపాల్ ఆరోగ్య సమస్యలతో సొంత జిల్లా నంద్యాలకు బదిలీ చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానం ఖాళీ కానుంది. అయితే కళ్యాణదుర్గం నుంచి శ్రీనివాసులు ఇక్కడికి రావడానికి సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. ఆమేరకు గురువారం కర్నూలు సర్కిల్ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు కూడా హాజరయ్యారు. అయితే ఇప్పటికే ఇదే స్థానంలోనే ఐదేళ్లు పూర్తి చేసుకొని, మరో రెండేళ్లు ఓడీపై పని చేస్తున్న మరో సీనియర్ అసిస్టెంట్ మాత్రం మరొకరికి అవకాశం లేకుండా తానే ఉండేలా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఏకంగా ఐదుగురు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలను అధికారులకు కౌన్సెలింగ్‌లో సమర్పించినట్లు తెలిసింది. ఆయన ఈ సీటుపై చూపిస్తున్న అతి ఉత్సాహం ఆ కార్యాలయంలోని సిబ్బందికి అనుమానాలు కలగజేస్తోంది.

ఆర్అండ్‌బీకి వెళ్లం

ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానం ఖాళీగా ఉంది. అక్కడికి మాత్రం ఎవరు రావడం లేదు. ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ స్థానానికి ఎందుకంత డిమాండన్నది ఆర్అండ్‌బీలోను ఎన్‌హెచ్‌లోను చర్చనీయాంశంగా మారింది. ఏళ్లుగా ఒకే సీటులో పని చేస్తున్న ఆ సీనియర్ అసిస్టెంటును స్థానిక అధికారులు వ్యతిరేకించి మరొకరికి అవకాశం కల్పిస్తారేమోననే అనుమానంతో శుక్రవారం సంబంధిత ఉన్నతాధికారులను ఆయన తనకు న్యాయం చేయాలని విన్నవించుకున్నట్లు కార్యాలయంలో ప్రచారం జరుగుతోంది.

యూనియన్ తరఫున పోరాటం

ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఏడున్నర సంవత్సరాలుగా పని చేస్తున్నవారికే మరో సారి స్థానం కల్పిస్తామంటే కుదరదు. కొత్తవారికి అవకాశం లేకుండా సిఫార్సులకే ప్రాధాన్యం ఇస్తే యూనియన్ తరఫున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని కొందరు ఆ కార్యాలయంలోని యూనియన్ నాయకులు బహిరంగంగానే చెప్పుకొస్తున్నారు. అసలు ఆ సీటులో ఏముంది. ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానానికి మాత్రం ఎవరు నియమించిన రావడం లేదు. ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ స్థానానికి ఎందుకు అంత డిమాండ్ అన్నది అర్థం కావడం లేదు.

సీఐటీయూతోనే కార్మిక వర్గాలకు విముక్తి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్
జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

అనంతపురం కల్చరల్, మే 30(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని కార్మిక వర్గాల సమస్యలకు సీఐటీయూతోనే విముక్తి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ జెండాలను శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్ వద్ద నాగేంద్రకుమార్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. 1970లో సీఐటీయూ ఆవిర్భావం నుంచి నేటివరకూ అవిశ్రాంతంగా పోరాటాలు చేస్తోందని, కార్మికవర్గానికి వెన్నుదన్నుగా ఉంటోందని అన్నారు. పదుల సంఖ్యలో కార్మిక చట్టాలు సాధించుకుని, కార్మికులకు రక్షణ కవచంగా సీఐటీయూ నిలిచిందని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, కార్మికుల కనీస వేతనం కోసం, హక్కుల సాధనకోసం, రక్షణకోసం నిత్యం ఐక్య పోరాటాలు చేస్తోందని అన్నారు. బ్రిటీష్‌వారి హయాం నుంచి 44 రకాల కార్మిక చట్టాలను పోరాడి సాధించుకున్నామని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని, ఇవి కార్మికులకు ఉరితాడుగా మారాయని విమర్శించారు. దేశ భవిష్యత్తుకోసం నాలుగు కార్మిక కోడ్‌ల రద్దు, 29 కార్మిక చట్టాల అమలుకోసం జూలై 9న దేశవ్యాప్తంగా కార్మికుల సార్వత్రిక సమ్మె చేపడుతున్నామని తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్వీ నాయుడు, జిల్లా కార్యదర్శి రమాదేవి, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, మున్సిపల్, సివిల్ సప్లై, జనరల్ హమాలీలు, అంగన్వాడీ, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్, మెడికల్ రెప్రజెంటేటివ్ యూనియన్‌ల నాయకులు శ్రీనివాసులు, ఆజాం బాషా, ఆదినారాణ, సురేంద్ర, శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు పరిష్కారం

కలెక్టర్ వినోద్ కుమార్



అనంతపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, 22-ఏ భూములను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. 22ఏకు సంబంధించి 16 క్లెయిమ్స్, చుక్కల భూములకు సంబంధించిన 31 దరఖాస్తులపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నిబంధల మేరకు ఉన్నవాటిని ఆమోదించారు. మిగిలినవాటిని పునః సమీక్షకు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ఎప్పటికపుడు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కాలువ కోసం భూములివ్వండి

రైతులకు సీపీఐ నాయకుడు జగదీశ్ వినతి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

గుంతకల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): రాగులపాడు వద్ద నుంచి చెరువులకు నీరందించే హంద్రీనీవా కాలువ కోసం రైతులు స్వచ్ఛందంగా భూములను ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, రైతు సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవన్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాగులపాడు నుంచి హంద్రీనీవాలో కాలవను తవ్వితే వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లోని చెరువులకు పుష్కలంగా నీరందుతుందని అన్నారు. ఇందుకోసం 215 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవచ్చిందని అన్నారు. ఈ కాలవ పూర్తి అయితే 12 చెరువులు, 15 చెక్‌డ్యాంలకు నీరు లభిస్తుందని, పరివాహక ప్రాంతంలోని పొలాల్లో వేలాది బోర్లు రిచార్జ్ అవుతాయని అన్నారు. భూసేకరణలో సమ్మతి తెలపాలని రైతులను కోరారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే సత్వరమే కాలవను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారని అన్నారు. ఈ విషయంగా పలు రైతు సంఘాల నాయకులతో కలసి తాము రైతులతో భేటీ అవుతామని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, రామాంజనేయులు, రైతు సంఘాల నాయకులు పులగుట్టపల్లికి చెందిన జయన్న, పామన్న, రామాంజనేయులు, మల్లేనిపల్లికి చెందిన శ్రీనివాసులు, పాత గుంతకల్లు పెన్నయ్య, జి కొట్టాల బాలకృష్ణ, ఎన్ కొట్టాల సయ్యద్ బాషా, దోనిముక్కల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నెట్టెం

అనంతపురం క్లాక్‌టవర్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా నెట్టెం వెంకటేష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం జీఓ నంబరు 366 జారీ చేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్‌ను సీఎం చంద్రబాబు ప్రకటించి నెల గడిచింది. డీసీఎంఎస్‌కు, ఏడీసీసీబీకి ఏడుగురు చొప్పున సభ్యులు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో తాత్కాలిక పాలకవర్గ సభ్యులను నియమించిన వెంటనే ఏడీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేస్తారు.

తల్లీకొడుకుల అదృశ్యం



అదృశ్యమైన హంసలత, కుమారుడు యశ్వంత్ (ఫైల్)

శెట్టూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కునుకూరుకు చెందిన హంసలత, ఆమె కుమారుడు యశ్వంత్ గురువారం నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఆమె భర్త మోహన్ బాబు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులందరూ కూలి పనులకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చేసరికి ఇద్దరూ అదృశ్యమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 9440796818, 9346917104 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శివ కోరారు.

సచివాలయ ఉద్యోగిపై టీడీపీ నాయకుడి బూతుపురాణం

అనంతపురం క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): నగరపాలిక పరిధిలోని 29వ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ అశ్వర్థరెడ్డిని 30వ డివిజన్ టీడీపీ నాయకుడు రాజేష్ అసభ్య పదజాలంతో దూషించాడు. కడపలో జరిగిన మహానాడుకు జనాలను ఎందుకు తరలించలేదని నిలదీశాడు. తాను అందరికీ ఫోన్ చేశానని అశ్వర్థ రెడ్డి చెబుతున్నా వినిపించుకోకుండా చిందులు వేశాడు. 'సచివాలయం విడిచిపెట్టి పోరా.. సచివాలయంలో ఉండి ఏం పీకుతున్నావ్..? కాళ్లు విరగ్గొడతా..' అని బూతు పురాణం వినిపించాడు. 'అన్నా.. పద్ధతిగా మాట్లాడు.. నేను అందరికీ ఫోన్ చేశా.. కావాలంటే కాల్ లిస్టు చూపిస్తా..' అని అశ్వర్థ రెడ్డి చెబుతున్నా.. రాయలేని భాషలో తిడుతూ రెచ్చిపోయాడు. ఈ ఆడియో సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయింది. టీడీపీ నాయకుడి తీరును సచివాలయ ఉద్యోగులు తప్పుబడుతున్నారు. ఆయనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బదిలీ సమయంలో ప్రమోషన్‌లా..?

జడ్పీలో నిర్ణయాలపై తీవ్ర విమర్శలు

అనంతపురం విద్య, మే 30(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయంలో జడ్పీ పాలకులకు, అధికారులకు ప్రమోషన్లు గుర్తుకువచ్చాయి. అనుకున్న వెంటనే ఉద్యోగోన్నతులు ఇవ్వడం.. ఖాళీలను కట్టబెట్టడం విమర్శలకు తావిస్తోంది. జడ్పీలో శుక్రవారం ఆరుగురికి ఆగమేఘాల మీద ప్రమోషన్లు ఇచ్చారు. జడ్పీ యాజమాన్యం కింద పనిచేసే ఐదుగురు ల్యాబ్ అసిస్టెంట్లు, ఒక రికార్డు అసిస్టెంట్‌కు జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చారు. ఈ మేరకు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇన్‌చార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తే ఎవరైనా హర్షిస్తారు. కానీ ప్రభుత్వం బదిలీలపై ఉన్న బ్యాన్ ఎత్తివేసి, ఈ నెల 16 నుంచి జూన్ 2లోపు సాధారణ బదిలీలు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. ఇలాంటి సమయంలో బదిలీల కోసం ఖాళీలు చూపి భర్తీ చేయాల్సిన ఉండగా.. అయిన వారికి ప్రమోషన్లు ఇచ్చి ఆ ఖాళీలను భర్తీ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ క్రమంలో గంట ముందు ఇచ్చిన స్థానాలను మార్చినట్లు సమాచారం. బదిలీల సమయంలో ఉన్న ఖాళీలను ప్రమోషన్ల పేరుతో భర్తీ చేసి, బదిలీల ఖాళీల కోసం ఎదురుచూస్తున్న సీనియర్ ఉద్యోగులకు అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు. బదిలీల సమయంలో ప్రమోషన్ల ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదాస్పద నిర్ణయాల ఆలోచన పాలకులదా..? లేక అధికారులదా అని ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం న్యూటౌన్ మే 30(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్ బీ ఉమ్మడి జిల్లా క్లరికల్ సిబ్బంది బదిలీలకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎస్ఈ రాజగోపాల్ ఆధ్వర్యంలోని కమిటీ బదిలీల ప్రక్రియ చేపడుతుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక ప్రాంతంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారి జాబితాను ఇప్పటికే తయారు చేశారు. మినహాయింపులు ఉన్నవారి నుంచి రిక్వెస్ట్ లెటర్లు తీసుకుని, నిబంధనల ప్రకారం బదిలీలు చేస్తామని ఎస్ఈ తెలిపారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారిలో జూనియర్ అసిస్టెంట్లు ఐదుగురు, ఒక టైపిస్టు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, 14 మంది కార్యాలయ సబార్డినేట్స్ ఉన్నారు.

జడ్పీ ఉద్యోగులకు..

అనంతపురం విద్య: ఉమ్మడి జిల్లా జడ్పీ ఉద్యోగులకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. 'ఖాళీలతో కబడ్డీ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న జడ్పీ ఉద్యోగులందరూ శనివారం ఉదయం 9.30 గంటలకు జడ్పీకి రావాలని సూచించారు.

61 మంది నాన్ టీచింగ్ ఉద్యోగుల బదిలీ



బదిలీల కౌన్సెలింగ్‌పై మాట్లాడుతున్న డీఈఓలు

అనంతపురం విద్య, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో 61 మంది నాన్ టీచింగ్ సిబ్బంది బదిలీ అయ్యారు. రెండు జిల్లాల విద్యాశాధికారుల కార్యాయాలు, ఎస్ఎస్ఏలు, పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులకు శుక్రవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం డీఈఓ ప్రసాద్ బాబు, శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ కిష్టప్ప, ఏడీల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. సీనియర్ అసిస్టెంట్లు 16 మంది, జూనియర్ అసిస్టెంట్లు 22 మంది, రికార్డు అసిస్టెంట్లు 15 మంది, టైపిస్టు ఒకరు, ఆఫీస్ సబార్డినేట్స్ ఏడుగురు బదిలీ అయ్యారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు రెండు జిల్లాలకు పరస్పరం బదిలీ అయ్యారు.

ప్రత్యేక విద్యపై మూడు రోజుల శిక్షణ

అనంతపురం విద్య, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్పెషల్ బీఈడీ, డీఎడ్ చేసి ఆర్‌సీఐ సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులకు ప్రత్యేక విద్యపై మూడు రోజుల శిక్షణ ఇస్తామని విశ్వభారతి కళానికేతన్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ టీఎస్ రెడ్డి తెలిపారు. తపోవనంలో జీపీఆర్ హాల్‌లో శుక్రవారం జరిగిన శిక్షణకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్పెషల్ బీఈడీ, డీఎడ్ చేసిన వాళ్లు తప్పనిసరిగా నిరంతర పునరావాస విద్య(సీఆర్ఈ) శిక్షణ పొందాలని ఆమె సూచించారు. ఈ కోర్సు చేయడం వల్ల వచ్చే 18 పాయింట్లు ప్రత్యేక విద్య చేసిన వారికి ఉద్యోగాల భర్తీ సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణకు 180 మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు మారెప్ప, వలీబా, పవన్‌కుమార్, సురేష్, మహమ్మద్ అలీ, లోకేష్‌రావు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 32వేలు

అనంతపురం రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 32వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6వేలు, సరాసరి రూ. 20వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 869టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

వేరుశనగ విత్తన పంపిణీకి చర్యలు

గార్లదిన్నె, మే 30(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుకు అవసరమైన వేరుశనగ విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుచేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గార్లదిన్నె మండలానికి కే6 విత్తన కాయలు 900 క్వింటాళ్లు కేటాయించారన్నారు. రైతులకు 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తామన్నారు. బ్యాగు రూ. 2790 కాగా సబ్సిడీ రూ. 1116 పోను రూ. 1674 రైతు చెల్లిం చాలన్నారు. వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాలలో భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు చెల్లించాలన్నారు. త్వరలోనే విత్తన కాయలు రైతులకు అందజేస్తామన్నారు.

అటవీశాఖ అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా సలీమ్

అనంతపురం న్యూటౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా సలీమ్ నియమితులయ్యారు. అందుకు అనుగుణంగా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్ కుమార్ నాయక్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత ఎడాది బదిలీల్లో భాగంగా సూపరింటెండెంట్‌గా ఉన్న షహనవాజ్ ఇక్కడి నుంచి వెళ్లి పోయారు. వేంపల్లి రేంజ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సలీమ్‌ను ఉద్యోగోన్నతి ద్వారా అనంతపురం అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆయన జూన్ 1వ తేదీ ఆదివారం తరువాత బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

నూతన డీఎఫ్‌ఓకు శుభాకాంక్షల వెల్లువ

అనంతపురం న్యూటౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారి విఘ్నేష్ తమ వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓగా కర్నూల్ డీఎఫ్‌ఓ శ్యామలను నియమించారు. అందులో బాగంగా శుక్రవారం జిల్లా అటవీశాఖ కార్యాలయానికి వచ్చిన నూతన డీఎఫ్‌ఓకు స్థానిక సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బందితో నూతన డీఎఫ్‌ఓ పలు శాఖ పరమైన అంశాలపై చర్చించినట్లు తెలిసింది. రేంజర్ శ్రీనివాసులు, మధుబాబుకు పలు ఆదేశాలు జారి చేసినట్లు తెలిసింది.

వారం పాటు అనంతలోనే స్క్వాడ్ డీఎఫ్‌ఓ

అనంతపురం న్యూటౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): పీలేరు స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురుప్రభాకర్ శుక్రవారం జిల్లా అటవీశాఖ కార్యాలయానికి వచ్చారు. ఆయన దాదాపు వారం రోజుల పాటు ఇక్కడే ఉండనున్నట్లు తెలిసింది. అటవీశాఖ కార్యాలయంలో చోటు చేసుకున్న అక్రమాల గురించి ఆరాతీయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. అందులో భాగంగానే ఆయన తమ టీమ్‌తో ఇక్కడికి వచ్చినట్లు సమాచారం.

బాలయ్యకు నేషనల్ అవార్డు ప్రకటనపై సంబరాలు



కేక్ కట్ చేస్తున్న గౌస్‌మొద్దీన్

అనంతపురం అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు తెలంగాణ ప్రభుత్వం ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు ప్రకటించడంపై అనంతలో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. జార్జియాలో అఖండ -2 షూటింగ్‌లో ఉన్న బాలకృష్ణకు గౌస్ మొద్దీన్ ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్టీఆర్ నేషనల్ అవార్డుతోపాటు బాలకృష్ణ నటించిన బ్లాక్ బాస్టర్‌గా నిలిచిన అఖండ, భగవంత్ కేసరి చిత్రాలు ఉత్తమ చిత్రాలుగా ఎంపికకావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు చిరంజీవి, జాఫర్, రామకృష్ణ, డిష్ ప్రకాష్, లక్ష్మీనారాయణ, బాబు, హర్ష వర్ధన్‌రెడ్డి, చోటు, మహేష్, మధుస్వామి, దబ్బర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం

● ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాశంకరమ్మ

గార్లదిన్నె, మే 30(ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతోగానో దోహప డుతుందని ఐసీడీఎస్ఐ సీడీపీఓ ఉమాశంకరమ్మ పేర్కొన్నారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గార్లదిన్నె ఒకటో అంగన్ వాడీ కేంద్రంలో కిశోర బాలికలు సాధికారవైపు పయనించేలా ఆర్థిక నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ ఉమాశంకరమ్మ ముఖ్య అతిథిగా హజరై ఆర్థిక నిర్వహణపై అవగాహన కల్పించారు. పోషకాహారం, ఆరోగ్య విషయంల పాటించాల్సిన పలు జాగ్రత్తలు సూచించారు. అలాగే బాలికల పట్ల జరుగుతున్న అత్యాచారాలు, బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల వల్ల భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలు వివరించారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎవరైనా బాల్య వివాహలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, వాణిశ్రీ, మహిళా పోలీస్ మనస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): నగరంలో మట్కా నిర్వహిస్తున్న నలుగురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి, నగరంలోని గుత్తి రోడ్డులో మట్కా నిర్వహిస్తున్న నలుగురు బీటర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10850 స్వాధీనం చేసుకున్నారు.

పేకాడుతున్న పదిమంది....

రాప్తాడు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపంలో పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం దాడులు చేసి హంపాపురం సమీపంలో పేకాడుతున్న పదిమందిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 21 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రోడ్డు లేని ఏకులనాగేపల్లి..!



కంకరతోలి వదిలేసిన ఇల్లూరు - ఏకులనాగేపల్లి రోడ్డు



అధ్వానంగా ఉన్న గుమ్మేపల్లి - ఏకులనాగేపల్లి లింక్ రోడ్డు

- ఇల్లూరుకు నాలుగు కిలోమీటర్ల దూరం
- మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తిరిగిన గ్రామం
- ఇరువైపులా అధ్వానం... ఇబ్బందుల్లో గ్రామస్థులు

శింగనమల, మే 30(ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తిరిగిన ఏకులనాగేపల్లికి ఇప్పటికీ తారురోడ్డు లేదు. కంకర తేలిన రోడ్డులోనే గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. .శింగనమల మండలంలోని గుమ్మేపల్లి పంచాయతీలోని ఓ చిన్న గ్రామం ఏకులనాగేపల్లి. ఇక్కడ 60 ఇళ్లు 500 మంది జనాభా ఉంది. అన్నీ వ్యవసాయాధార కుటుంబాలే. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి స్వగ్రామం ఇల్లూరు ఈ గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఏకులనాగేపల్లికి కిలోమీటర్ దూరంలో నీలం సంజీవరెడ్డి గేట్‌హౌస్ ఉంది. ఆయన చిన్నప్పటి నుంచి ఏకులనాగేపల్లికి తిరేగేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ఈ గ్రామానికి నేటికీ రెండు వైపుల నుంచి సరైన రోడ్డు మార్గం లేదు. ఇల్లూరు నుంచి ఏకులనాగేపల్లికి గతంలో తారు రోడ్డు కోసం కంకరతోలి వదిలేశారు. అలాగే గుమ్మేపల్లి నుంచి ఇప్పటికి కాలువ రోడ్డు లోనే రాకపోకలు జరుగుతున్నాయి. ఈ మార్గానికి లింక్ రోడ్డు వేయాలని ప్రతిపాదనలు ఉన్న అమలు కాలేదు. ఇప్పటికైన మాజీ రాష్ట్రపతి నడిచిన నేలకు సరైన రోడ్డు మార్గం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కంకర తోలి..వదిలేశారు



చిన్నప్పటి నుంచి మేము బయట గ్రామానికి వెళ్లాలంటే సరైన రోడ్డు లేదు. గ్రామానికి ఇరు వైపులా ఉన్న రెండు రోడ్ల పరిస్థితి అలాగే ఉంది. మట్టిరోడ్లలోనే పోతున్నాం. అయితే ఐదేళ్ల కిందట ఇల్లూరు నుంచి ఏకుల నాగేపల్లికి నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డు వేసేందుకు కంకర తోలారు. కానీ అప్పటి నుంచి పట్టించుకోలేదు. ఆ కంకరలోనే ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో వెళుతున్నారు. దీనికి తోడు రోడ్డు పోడువునా కంపచెట్లు పెరిగాయి. **- వేమారెడ్డి, గ్రామస్థుడు**

రోడ్డు బాగుంటేనే గ్రామాభివృద్ధి



ఒక గ్రామం అభివృద్ధి చెదాలంటే తప్పనిసరిగా రోడ్డు సౌకర్యం బాగుండాలి. అయితే మా గ్రామానికి రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రోడ్డు సరిగా లేకపోవడంతో మేమం పండించిన పంటలను మార్కెట్ తరలించేందుకు రోజూ ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా గ్రామానికి తారు రోడ్డు వేయాలి. **- గోపాల్‌రెడ్డి, గ్రామస్థుడు**

మా వంతు కృషి చేస్తున్నాం



ఏకులనాగేపల్లిలో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాం. తాగునీటి సమస్యలేదు. కాలనీలను శుభ్రంగా ఉంచుతున్నాం. గ్రామానికి ఇరు వైపులా రోడ్లు నిర్మించాలని అధికారులకు, పాలకులకు తెలియజేశాం. త్వరలో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తాం.

- దేగల లలితమ్మ, సర్పంచ్, గుమ్మేపల్లి

ఎమ్మెల్యే హామీ ఇచ్చారు



గుమ్మేపల్లి పంచాయతీలోని ఏకులనాగేపల్లికి సరైన రోడ్డు లేకపోవడంతో గ్రామస్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఇల్లూరు - ఏకులనాగేపల్లి పెండింగ్ రోడ్డు, గుమ్మేపల్లి - ఏకులనాగేపల్లి నాలుగు కిలో మీటర్ల లింక్‌రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలో పనులు ప్రారంభిస్తారనే నమ్మకం ఉంది.

- దేగల కృష్ణమూర్తి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి

మహనీయుల ఆశయాలు కొనసాగించాలి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 30(ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల నుంచి దేశ పురోభివృద్ధికి తమ జీవితాలను త్యాగంచేసిన మహనీయుల ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాణి అహల్యాబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. జిల్లా అధ్యక్షులు రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకలకు మాధవ్‌తో పాటు కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి, సీనియర్ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, కడప ఇన్‌చార్జ్ దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాణి అహల్యాబాయి త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలను దేశ వ్యాప్తంగా ఏడాదిపాటు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఆమె పారిశ్రామిక ఇండోర్ నగరాన్ని తీర్చిదిద్దారన్నారు. గుర్తింపుపొందిన చరిత్రకారుల జయంతి ఉత్సవాలను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వారి సేవలను ప్రజలకు తెలియజేస్తు న్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతి

అనంతపురం సెంట్రల్, మే 30(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న రిజర్వేషన్ ఉద్యోగుల సమ్యలు పరిష్కరించాలని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామ చంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయ విభాగం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం రామ చంద్ర మాట్లాడుతూ... వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నగరపాలక సంస్థ కమిషనర్ పర్యవేక్షణలో, గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులు ఎంపీడీఓ పర్యవేక్షణలో పనిచేస్తారన్నారు. సెలవులు, ఇంక్రిమెంట్లు, ఎన్‌ఓసీలు తదితర అంశాల్లో పర్యవేక్షణ అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. వివిధ రకాల పనులు పూర్తిచేసేలా టార్గెట్లు విధించడం, ఇం టి సర్వేలు చేయించడం ఇలా అనేక రూపాల్లో పనిభారం మోపుతున్నారన్నారు. రాయలసీమ లోని సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే పర్యవేక్షణ అధికారుల తీరుపై ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యల్లన్న, ఉజ్వల్, నాగేష్, రామాంజినేయులు, ఆదినారాయణ, తిప్పేస్వామి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మీ పాలనలో హంద్రీనీవాకు చేసిందేమిటి..?

● జూన్ 4న వెన్నుపోటు దినం ● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ వాసినని చంద్రబాబుకు ఇప్పుడే గుర్తుకు వచ్చిందా..? నీ పాలనలో హంద్రీనీవాకు చేసిందేమిటని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి ప్రశ్నించారు. ఆయన శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన ఇన్నేళ్లలో రాయలసీమకు ఆయన చేసిందేంటన్నారు. అది మహానాడు కాదు మహాడ్రామాగా అభివర్ణించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేకే చంద్రబా బు వైకుంఠపాళి కథలు చెబుతున్నారన్నారు. ఏడాదిలోనే మూడు లక్షల పింఛన్లకు కోత పెట్టారని విమ ర్శించారు. అసెంబ్లీ సాక్షిగా మేనెలలో తల్లికి వందనం ఇస్తామ న్నారని, ఒకేసారి ఇస్తారో..?లేక విడతలవారీగా ఇస్తారోనని ఎద్దేవా చేశారు. రాయలసీమకు ఉపయోగపడే హంద్రీనీవా ను ఎందుకు వెడల్పు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ చూసి భయపడేవాళ్లు ఎవరూ లేరన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరిస్తూ జూన్ 4వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నేతలు ప్రజలను భాగస్వామ్యం చేసుకుని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఒప్పంద పనులను ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలి

● ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఒప్పంద పనులకు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ కాంట్రాక్టర్లను కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జేఎన్టీయూ రోడ్డులోని విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సాకేహరి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత, అనుభవమున్న కాంట్రాక్టర్లకు టెండర్ల ద్వారా ఒప్పంద పనులు చేయించడం అధికారుల విధి అన్నారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఆ నిబంధనలు విస్మరించి అనర్హులకు ఒప్పంద పనులను అప్పగించడం అన్యాయమన్నారు. అర్హులైన కాంట్రాక్టర్లు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారంటూ ప్రస్తుత విద్యుతశాఖ ఎస్‌ఈగా పనిచేస్తున్న అధికారి టెండర్లను ఇతరులకు అప్పగించడం ఏంటని ప్రశ్నించారు. ఎస్‌ఈపై చర్యలు తీసుకుని అర్హులకు టెండర్లు అప్పగించేలా ప్రభుత్వం చొరవచూపాలని కోరారు. నాయకులు రామకృష్ణ, సుగమంచి శ్రీనివాసులు, రమేష్, కుమార్, గణేష్, గోపాల్, విజయ్, ఆది పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దోచిపెడుతున్న పాలకులు

● ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 30(ఆంధ్రజ్యోతి): కష్టాన్నే నమ్ముకున్న కార్మికుల పొట్టకొట్టి కార్పొరేట్లకు దోచిపెడుతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గణేష్ పండా, కిశోర్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక రజకనగర్ లోని కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం ఏఐఎఫ్‌టీయూ న్యూ అనుబంధ ఆటో కార్మికుల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గణేష్ పండా, కిశోర్‌బాబు మాట్లాడుతూ స్వయం ఉపాధిగా ఎంచుకున్న ఆటోవృత్తితో కార్మికుల పొట్టగడవడమే చాలా కష్టంగా మారిందన్నారు. బడా కార్పొరేట్లకు లక్షల కోట్లు బ్యాంకు రుణాలు రద్దు చేస్తున్న పాలకులు.... ఆటో కార్మికులకు సహకారం అందించకపోగా వివిధ రకాల భారాలు వేయడం దుర్మార్గమని మండిపడ్డారు. రవాణా రంగంలో వచ్చిన ర్యాపిడో, ఓలా, బ్లబ్లా వంటి యాప్స్ ఫలితంగా ఆటో కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడిందన్నారు. అనంతరం ఆటోకార్మికసంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులుగా హాజీవలి, ఎం రాజు, ఉపాధ్యక్షుడిగా అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా షరీఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రచయిత సూర్యసాగర్, మానవత రక్తదాతల సంస్థ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, మల్లేశ్వరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి

● డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి



యోగాంధ్రలో పాల్గొన్న నగరవాసులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రలో వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక హౌసింగ్ బోర్డులోని అభయాంజనేయ స్వామి దేవాలయం ఆవరణంలో ప్రత్యేకంగా యోగాసనాలు ఆచరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తం గా యోగాంధ్రను నిర్వహిస్తున్నారని, యోగాతో రోగాలను దూరం చేయొచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శైలజ, ఆయుష్ అధికారులు రామ్‌కుమార్, భాస్కర్, లాల్యానాయక్, యోగా గురువులు కృష్ణవేణి, గురురాజా, త్యాగరాజ్, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్, పతంజలి సంస్థ రవికుమార్, వివేకానందయోగా కేంద్రం రాజశేఖర్ రెడ్డి, బ్రహ్మకుమారి శారద, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడును విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబుపై నమ్మకం, యువనేత నారా లోకేశ్‌పై విశ్వాసం ప్రతి కార్యకర్తలో కనిపించిందన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి మహానాడుకు హాజరై విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ నాయకుడు రాజేష్‌ను అరెస్ట్ చేయాలి

● వార్డు సచివాలయ ఉద్యోగుల ఆందోళన



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

అనంతపురం క్రైం, మే30(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని 29వ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అశ్వర్థరెడ్డిపై దుర్భాషలాడిన టీడీపీ నాయకుడు రాజేష్‌న అరెస్ట్ చేయాలని సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వంతో సంబంధంలేని వ్యక్తులు ఉద్యోగులపై అజమాయిషీ చేస్తూ బెదిరింపులకు పాల్పడటం అన్యాయమన్నారు. సమాజం తలవంచుకునే బాషతో ఉద్యోగిని తిట్టడం ప్రభుత్వాన్ని దూషించడమేనన్నారు. పోలీస్‌శాఖ స్పందించి తక్షణమే రాజేష్‌ను అరెస్ట్ చేయకపోతే నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

పండమేరు బ్రిడ్జి మరమ్మతులకు శ్రీకారం

● రూ.80 లక్షలతో పనులు ప్రారంభం

అనంతపురం న్యూటౌన్, మే 30(ఆంధ్రజ్యోతి) జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోని ఆర్డీటీ స్టేడియం వద్ద ఉన్న పండమేరు బ్రిడ్జికి ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభమయ్యాయి. రూ.80 లక్షలతో టెండర్లు నిర్వహించడంతో ముంబయికి చెందిన టెక్‌ఫాస్ట్ కంపెనీ ప్రతినిధులు సింగిల్ టెండర్‌తో దక్కించుకున్నారు. ఆర్నెల్లలో పూర్తి చేసేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే అతి పెద్ద బ్రిడ్జిలు సైతం మంచి నైపుణ్యంతో మరమ్మతులు చేయించే కంపెనీ ప్రతినిధులకు టెండర్ దక్కడంతో నాలుగు నెలల్లోనే పనులు పూర్తి చేసేలా ప్లాన్ చేసినట్లు ఎస్‌హెచ్ ఈఈ సుధాకర్‌రెడ్డి చెబుతున్నారు. గత ఎడాది కురిసిన భారీ వర్షాలకు పండమేరు వంక భారీగా పారడంతో అక్కడి బ్రిడ్జి కింది భాగం దెబ్బతింది. దీంతో దాదాపు ఆర్నెల్లకు పైబడి ఆర్డీటీ స్టేడియం సమీపంలోని పండమేరు బ్రిడ్జి మీద రాకపోకలు నిలిపివేశారు. నైపుణ్యం ఉన్న టెక్‌పాస్ట్ కంపెనీ టెండర్ దక్కించు కోవడంతో పనులను సకాలంలో నాణ్యంగా పూర్తి చేస్తారన్న ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి అయిన వెంటనే ట్రాఫిక్ సమస్య పరిష్కరించేలా బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకు రానున్నట్లు ఈఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

రోజూ చెత్తను సేకరించాలి

● ప్రణాళికలు సిద్ధం చేసుకోండి : కలెక్టర్

అనంతపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. తొలుత సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ... చెత్త సేకరణలో ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకొని చెత్త సేకరణ, పరిశుభ్రతలో అనంతను ఆదర్శంగా ఉంచుదామని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, నగరపాలక కమిషనర్ బాలస్వామి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, టూరిజం శాఖ అధికారి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాల సమస్య పరిష్కరిస్తాం

● సర్వజన ఆసుపత్రి వైద్యాధికారుల హామీ



సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న ఏఐటీయూసీ నేత కృష్ణుడు తదితరులు

అనంతపురం టౌన్/విద్య, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వజనాస్పత్రిలో శానిటేషన్ కార్మికుల వేతనాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని వైద్యాధికారులు హామీ ఇచ్చారు. శానిటేషన్ కార్మికులకు మూడునెలల జీతాలు పెండింగ్ ఉండడంతో ఇటీవల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. త్వరగా వేతనాలు చెల్లించాలని, లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ నాయకులు అదే సమ యంలోనే అల్టిమేటమ్ పెడుతూ సూరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఆర్‌ఎంఓ డాక్టర్ రామక్రిష్ణ ఏఐటీయూసీ నాయకులు కృష్ణుడు తదితరులను పిలిపించి వేతనాలు చెల్లింపుపై చర్చించారు. వేతనాలు నెలలు తరబడి ఇవ్వకపోతే కార్మికు లు, సెక్యూ రిటీ గార్డులు ఎలా బతుకుతారని ఏఐటీయూసీ నాయకులు ఆవేదన వెలిబుచ్చారు. తప్పకుండా జీతాలు చెల్లించేలే ఏజెన్సీవారితో మాట్లాడు తున్నామని, సమస్యను త్వరలో పరిష్కరిస్తామని వైద్యాధికారులు హామీ ఇచ్చారు. దీంతో దశలవారీ చేట్టబోయే ఆందోళనకు కొంత సమయం ఇవ్వడానికి ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, భార్గవి, పొన్నూరు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభ వేడుకలు


విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న అర్చకులు

యల్లనూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ వేంకటరమణస్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మూడురోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో రెండోరోజైన శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి విగ్రహాలకు వివిధ ధాన్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101బిందెల జలంతో అభిషేకం చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చి తిలకించారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నదానం, జడకోలన్న కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. శనివారం విగ్రహాల ప్రతిష్ఠతో పాటు రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా నారసింహుడి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూలవిరాట్

గుత్తిరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో వెలసిన నవ అహోబిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని వైభవంగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తర్వాత సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకిలో గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

విడపనకల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు పంచాయతీలో గల ఉండబండ వీరభద్రస్వామి ఆలయంలోని హుండీల కానుకల్ని శుక్రవారం లెక్కించారు. గత పది నెలలుగా భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల్ని లెక్కించినట్లు ఆలయ ఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. రూ. 12.63లక్షల నగదు, 7గ్రాముల బంగారం,. 200 గ్రాముల వెండి వచ్చినట్లు చెప్పారు. వీటిని పాల్తూరు అనంత గ్రామీణ బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. ఉండబండ, పాల్తూరు గ్రామాల పెద్దలు, ఎస్ఐ మురహరి, టీడీపీ నాయకుడు వన్నూర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ సర్కిల్లో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లేష్, నాయకులు నిర్మల, రేణుకా, మురళి, అశోక్, ప్రశాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

అర్హుల జాబితా విడుదల

పుట్లూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను పాఠశాలలో శుక్రవారం విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఓబులరెడ్డి తెలిపారు. మొత్తం 118మంది పరీక్ష రాయగా 64మంది విద్యార్థులు అర్హత సాధించారని ఆయన తెలిపారు.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన

కళ్యాణదుర్గం, మే 30(ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించవచ్చని పట్టణంలోని కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త డాక్టర్ చంద్రాయుడు సూచించా రు. కంబదూరు మండలంలోని తిమ్మాపురం, ఓబిగానిపల్లి, కళ్యాణదుర్గం మండలంలోని పాలవాయి, మల్లాపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి అక్కడి రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో సాగు చేసే వివిధ రకాల పంటల్లో అధిక దిగుబడుల కోసం ఏయే మెళకువలు పాటించాలో వివరించారు. అదేవిధంగా మట్టి పరీక్షలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, ఉద్యాన పంటలలో సమయానికి అనుకూలంగా చేపట్టే సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై వివరించారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు, టీడీపీ నాయకుడు పైడిపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పండ్లతోటల రైతులకు అవగాహన సదస్సు

పుట్లూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లూరు, శనగలగూడూరు గ్రామాల్లో శుక్రవారం పండ్లతోటల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త సుబ్రమణ్యం మాట్లాడుతూ చీనీ, దానిమ్మ, నిమ్మ, అరటి పంటల్లో వచ్చే చీడపీడల నివారణకు తగిన మందులు తప్పనిసరిగా పిచికారీ చేయాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. వీటివల్ల పెట్టుబడి తగ్గుతుందని రైతులకు సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి, రేకులకుంట శాస్త్రవేత్తలు రాజన్న, చందన, సుబ్రమణ్యం, హిమబిందు, ఏఓ కాత్యాయిని, ఏఈఓ హరి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ధన్యవాదాలు: సీపీఐ

గుంతకల్లు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం రాత్రి తనిఖీ చేసి అక్కడి లోపాలపై చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ఎస్‌కు ఆదేశాల ఇవ్వడంపై సీపీఐ నాయకులు ప్రసాద్, గోల్డ్ నూర్‌బాషా ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వారు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రరావుతో సమావేశమై మాట్లాడారు. సెక్యూరిటీ గార్డులను సరిగా విధులు నిర్వహించేలా చూడాలన్నారు. దాతలు అందజేసిన అంబులెన్స్‌ను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. బెడ్లపై దుప్పట్లను ఏర్పాటు చేయాలని కోరారు. రోగులను అనంత పురం, కర్నూలుకు తరలించేటప్పుడు అధిక డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు గొటుకూరులో మంత్రి పర్యటన

ఉరవకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలంలోని గొటుకూరులో ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం పర్యటించనున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొననున్నట్లు టీడీపీ నాయకులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.

క్లాత్ సంచులను వినియోగించాలి

గుంతకల్లు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్లాత్ సంచులను వాడాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పేర్కొన్నారు. ప్ర పంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గుత్తిరోడ్డులో గల మార్కెట్ ఏరియా వద్ద శుక్రవారం ఆయన క్లాత్ సంచులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యవరణానికి నష్టం కలిగించే సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదన్నారు. క్లాత్ సం చులను వినియోగించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది, పలువురు వ్యాపారులు తదిత రులు పాల్గొన్నారు.

సేవ్ ఆర్డీటీ పేరుతో వైసీపీ స్వార్థ రాజకీయం

- 17న నిర్వహించిన బైక్ ర్యాలీలో వైసీపీ జెండాలు.. జై జగన్ నినాదాలు
- సేవ్ ఆర్డీటీ ఇదేనా అంటూ విమర్శిస్తున్న ప్రజలు
- మళ్లీ పాదయాత్ర అంటూ మరోసారి హైడ్రామాకు శ్రీకారం


ఈ నెల 17 న పార్టీ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ శ్రేణులు

కళ్యాణదుర్గం, మే 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ సేవ్ ఆర్డీటీ పేరుతో స్వార్థ రాజకీయానికి తెరలేపింది. అంతర్గత పోరుతో పార్టీ బలహీనపడుతున్న తరుణంలో సేవ్ ఆర్డీటీ అంటూ నాయకులు కొత్త డ్రామాను తెరపైకి తెచ్చారు. ఆర్డీటీ కోసం నిర్వహించిన కార్యక్రమాల్లో పార్టీ జెండాలు చూపుతూ, జగన్నినాదాలు చేస్తుండడంతో ప్రజల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 17న సేవ్ ఆర్డీటీ పేరుతో పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో వైసీపీ శ్రేణులు పార్టీ జెండాలతో ద్విచక్రవాహనాలపై హల్ చల్ చేశారు. సాధారణంగా అయితే ఆర్డీటీ సేవల వివరాలను తెలిపే ఫ్లకార్డులను ప్రదర్శిస్తారు. కానీ వైసీపీ వారు నవరత్నాల లోగోలతో ఉన్న బ్యానర్లను ప్రదర్శిస్తూ జై జగన్.. సీఎం..సీఎం..అంటూ నినాదాలు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అయితే ఇంకా ఆ విమర్శలు మరవకముందే మరలా వైసీపీ మరో హైడ్రామాకు తెరలేపింది. ఆర్డీటీ కోసం జూన్ 4న పాదయాత్ర చేస్తామంటూ పేర్కొంటోంది.

అంతర్గత పోరు నుంచి దృష్టి మరల్చేందుకే..

నియోజకవర్గంలోని వైసీపీలో అంతర్గత పోరు తీవ్రంగా నడుస్తోంది. దాని నుంచి ప్రజల దృష్టి పక్కకు మరల్చేందుకే సేవ్ ఆర్డీటీ అంటూ హైడ్రామాకు తెరలేపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రంగయ్యతో పార్టీకి ఎటువంటి ఇబ్బందులు లేవు. కానీ పార్టీలోనే కొందరు ఇన్‌చార్జిను మారుస్తారంటూ కొత్త వేడిని పుట్టించి విభేదాలు సృష్టించడానికి పావులు కదుపుతున్నారు. దీంతో పాటు మాజీమంత్రి ఉషశ్రీచరణ్ వర్గీయులు పార్టీకి పూర్తిగా దూరంగా ఉంటున్నారు. దాంతో పాటు కంబదూరు మాజీ ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ, ఆమె భర్త ములకనూరు గోవిందుపై ఈ మధ్య కాలంలో సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో ఆయన అనుచర వర్గం కూడా పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇంత అంతర్గత పోరుతో వైసీపీ పూర్తిగా బజారున పడింది. వీటన్నింటిపై దృష్టి మరల్చడానికి ఆ పార్టీ నాయకులు ఆర్డీటీకి మేమే దిక్కు అంటూ ఏవేవో గొప్ప..గొప్ప ప్రకటనలు చేస్తూ, చివరికి విమర్శలు పాలవుతున్నారు. సేవ్ ఆర్డీటీ పేరుతో వైసీపీ నాయకులు నాటకాలు ఆడడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

ఆర్డీటీని రాజకీయాల్లోకి లాగొద్దు..



ఆర్డీటీ సంస్థను రాజకీయాల్లోకి తీసుకురాకండి. వైసీపీ ప్రభుత్వంలోనే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ ను నిలిపివేశారు. అప్పుడు ఆ పార్టీ నేతలు నేతలు ఎక్కడున్నారో ప్రజలు చెప్పాలి. వైసీపీ నేతలు రాజకీయం కోసమే ఇదంతా చేస్తున్నారే కానీ.. ఆర్డీటీని కాపాడడం కోసం కాదు. ఒకరు ఇన్‌చార్జ్ పదవిని కాపాడుకోవడం కోసం, మరొకను ఉన్న పదవి కాపాడడం కోసమే ఆరాట పడుతున్నారు.

- చౌళం మల్లికార్జున, టీడీపీ నాయకుడు, కళ్యాణదుర్గం

యోగాతో మానసిక ప్రశాంతత


యల్లనూరులో యోగాలో పాల్గొన్న అధికారులు

యల్లనూరు, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాచేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ఆయన పలువురు అధికారుల చేత, ప్రజల చేత యోగసనాలు వేయించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు 10నిమిషాలు అయినా యోగా చేయాలని సూచించారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ఉరవకొండ: యోగాంధ్రలో భాగంగా పట్టణంలోని షిర్డీసాయి కల్యాణ మండపంలో యోగా గురువు వెంకట్ యోగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దిన చర్యలో భాగంగా యోగాసనాలు అలవర్చుకోవాలన్నారు. యోగా చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం యోగాసానాలకు సంబంధించి 10 అంశాలపై చిన్నారులకు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


రంగ (ఫైల్)

తాడిపత్రి, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమలి గ్రామ సమీపంలో రంగ (45) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. చిన్నపొలమడ గ్రామానికి చెందిన చాకలి రంగ రజక వృత్తితో పాటు మగ్గం పని చేసేవాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై అప్పులు చేశాడు. కుటుంబపోషణ సైతం సరిగా జరగకపోవడంతో మదన పడుతుండేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై శుక్రవారం కోమలి గ్రామ సమీపంలో గల రైల్వే పట్టాలపై రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సులోచన, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

పెద్దవడుగూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపల్లిలో బెల్టు షాపు నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. సిబ్బందితో దాడులు చేసి ఆ వ్యక్తిని అరెస్టు చేశామని, అలాగే అతడి వద్ద నుంచి 9మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

మట్కాబీటర్..

పెద్దపప్పూరు, మే30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన ఓ మట్కాబీటర్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అలాగే అతడి వద్ద నుంచి రూ. 12500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

మాజీ వార్డు మెంబర్ మృతి

రాయదుర్గంరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ మాజీ వార్డు మెంబర్ గుర్రప్ప(65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు గ్రామానికి చేరుకుని అతని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత కుటుంబాన్ని పరామర్శించారు.

హెచ్ఐవీ నియంత్రణపై కళాజాతా

కుందుర్పి, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జంగం శ్రీనివాసులు కళా బృందం సభ్యులు హెచ్ఐవీ నివారణపై కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి చాంద్ బేగమ్, రూరల్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మారుతేశ్వరి, కళాకారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ కోసం పేర్లను నమోదు చేయించుకోండి

- రైతులకు ఏఓ సూచన

పామిడి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులు విత్తన వేరుశనగ పొందేందుకు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి లీనా వసుంధర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం సబ్సిడీతో విత్తనకాయలు అందజేయనున్నట్లు చెప్పారు. మండలానికి రెండు రకాల విత్తన కాయలను 1200 క్వింటాళ్లు కేటాయించారన్నారు. వాటిని 40శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తామన్నారు. 30 కేజీల బ్యాగు ధర రూ. 2790 కాగా సబ్సిడీతో రూ. 1674లకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విత్తన వేరుశనగ కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ తీసుకెళ్లి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు చెల్లించాలని సూచించారు. త్వరలోనే విత్తన వేరుశనగను రైతులకు అంద జేస్తామన్నారు.

●రాయదుర్గంరూరల్: మండలంలో విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ మహేంద్ర ప్రకటనలో తెలిపారు. విస్తీర్ణాన్ని బట్టి అర ఎకరా ఉన్న రైతుకు 30 కేజీల బ్యాంగు ఒకటి అందజేస్తామన్నారు. ఇక ఒక ఎకరా ఉన్నవారికి 30 కేజీల బ్యాగులు రెండు, ఎకరా పైన ఉంటే 30 కేజీల బ్యాగులు మూడు ఇవ్వనున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు రైతు సే వా కేంద్రాలకు వెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మండలానికి కే6 రకం 2800 క్వింటాళ్లు , అదే విధంగా లేపాక్షి రకం 200 క్వింటాళ్లు కేటాయించినట్లు చెప్పారు.

●బొమ్మనహాళ్: సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రైతులు రైతు సేవాల కేంద్రాల్లో పేర్లను నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సాయికుమార్ సూచించారు. మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 500 క్వింటాళ్ల వేరుశగన విత్తనకాయలను కేటాయించారన్నారు. కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిశోరివికాసంపై అవగాహన సదస్సు

బ్రహ్మసముద్రం, మే 30(ఆంధ్రజ్యోతి): మం డలంలోని కన్నెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవాలని సూచించారు. అలాగే వారికి ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిశుభ్రత, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ , అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు


పట్టభద్రురాలికి పట్టా అందిస్తున్న వైస్ చాన్సలర్

గుత్తి, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు పారిశ్రామికంగా ఎదిగి ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు సూచించారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్‌డేను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సుదర్శన్‌రావు పాల్గొని పట్టభద్రులైన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టభద్రులు ఆసక్తి గల రంగాలను ఎంచుకుని రాణించాలన్నారు. సమాజానికి అవసరమైన పరిశోధనలు చేసి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, తద్వారా ఇతరులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. తర్వాత ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన తొలి బ్యాచ్ విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో డిగ్రీ పట్టాలను అందజేశారు. కళాశాలలో టాపర్లుగా నిలచిన షేక్ ఆరీఫా బేగం, షేక్ రేష్మాలకు వైస్‌చాన్సలర్ పట్టాను, గోల్డ్‌మెడల్‌ను అందజేశారు. కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల పట్ల వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం

- సర్వే పేరుతో కార్యాలయానికి గైర్హాజరు
- అందుబాటులో లేని సీసీలు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

బొమ్మనహాళ్, మే 30(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వెలుగు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు అసహనం కలిగిస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వారు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మండలకేంద్రంలో ఉన్న ఉన్న వెలుగు కార్యాలయాన్ని ఆంధ్రజ్యోతి శుక్రవారం విజిట్ చేసింది. ఉదయం 11 గంటలైనా కార్యాలయానికి సిబ్బంది ఎవరూ రాకపోవడంతో ఖాళీకుర్చీలు దర్శనమిచ్చాయి. స్వీపర్ మాత్రమే ఉన్నారు. సిబ్బంది కోసం డ్వాక్రామహిళలు కార్యాలయం బయట వేచి చూస్తూ కనిపించారు. సిబ్బంది ఎప్పుడు వస్తారో .. ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై కనీసం సమాచారం ఇచ్చే వారు కూడా కరువయ్యారు.

ఆంధ్రజ్యోతి విజిట్

వెలుగు సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సూక్ష్మరుణాల ప్రణాళిక సర్వే పేరుతో కార్యాలయానికి ఎప్పు డు వస్తారో.. ఏ సమయంలో ఎక్కడ ఉంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. డ్వాక్రా మహిళలు వివిధ పనులపై కార్యాలయానికి వెళితే సి బ్బంది ఏ ఒక్కరూ కనిపించరు. విధులకు హాజరైన వారు నిబంధనల ప్రకారం అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి మూమెంట్ రిజిస్టర్‌లో ఎక్కడికి వెళ్లేది, అందుకు కారణం నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మండలంలో బొమ్మనహాళ్, ఉంతకల్లు, శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ క్లస్టర్లు ఉండగా నలుగురు సీసీలు ఉన్నారు. అలాగే 40 మంది యానిమేటర్లు ఉన్నారు. వారందరూ అటు పాలకులు, ఇటు ఉన్నతాధికారుల కళ్లుగప్పి విధులను నామమాత్రంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెలుగుకార్యాలయ సిబ్బందిపై దృష్టి సారించి సక్రమంగా విధు లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘం సభ్యులు కోరుతున్నారు.


కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు


కార్యాలయం ముందు వేచిఉన్న డ్వాక్రా మహిళలు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


మహిళకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శుక్రవారం ఆయన సీఎం సహాయ నిధి చెక్కును లబ్ధిదారురాలికి అందజేశారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దె గ్రామానికి చెందిన జయలక్ష్మి అనే మహిళకు రూ. 50 వేలు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కు ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలో ఎంతోమంది నిరుపేదలను ఆదుకున్నామన్నారు. ఇదంతా సీఎం చంద్రబాబు , మంత్రి లోకేశ్ కృషితోనే సాధ్యమైందని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

కుందుర్పి మండలం యర్రగుంట గ్రామంలో శనివారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేతుల మీదుగా సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఆ గ్రామంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవంలో కూడా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఇందుకు పట్టణంలో మార్కెట్ యార్డులో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ


అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ శీనుబాబు

యాడికి, మే 30(ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే సైబర్ నేరాల బారిన పడకుండా ఉండవచ్చునని ఏపీ సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శీనుబాబు సూచించారు. మండలకేంద్రంలోని విజన్‌హైస్కూల్‌లో శుక్రవారం విశాలాక్షిఖాదీ సేవా సంస్థ వారు సైబర్‌నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ ప్రోగ్రాం ఏపీ, తెలంగాణరాష్ట్రాల కోఆర్డినేటర్ శ్రీనుబాబు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే యాప్‌లు, లింక్‌లు ఓపెన్ చేయకూడదని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సైబర్ క్రైంలో రిపోర్టు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశాలాక్షి ఖాదీసేవా సంస్థ అధ్యక్షుడు నారాయణస్వామి, విజన్‌హైస్కూల్ కరెస్పాండెంట్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ


యాడికిలో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

యాడికి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల రేషన్ షాపులను తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ల తో మాట్లాడుతూ.. జూ న్ 1వ తేదీ నుంచి నుంచి రేషన్ సరుకులను రేషన్ దుకాణాల ద్వారానే ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కనుక ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సరుకులన్నింటినీ లబ్ధిదారులకు అందజేయాల్సిందేనని తెలిపారు. ఖ చ్చితమైన తూకాలు ఉండాలన్నారు. రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి లబ్ధిదారుడికి రేషన్ సరుకులు అందించాల్సిందేనని చెప్పారు. తనిఖీచేసి న వారిలో ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వోలు దామోదర్‌నాయుడు, రంగస్వామి, శ్రావణ్‌కుమార్, కుమారస్వామి, నరసింహరాజు, భీమేశ్వరరెడ్డి ఉన్నారు.

● బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు, వన్నళ్లి గ్రామాల్లో గల రేషన్ షాపులను తహసీల్దార్ మునివేలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లతో మాట్లాడుతూ నిత్యావసర సరకులు జూన్1 వ తేదీ నుంచి రేషన్ షాపుల్లోనే పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ వివరాలను యాప్‌లో పక్కగా నమోదు చేయాలని సూచించారు. సమయానికి షాపులు ఓపెన్ చేసి ప్రజలకు బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ఓ రామన్న, డీలర్లు వీఎల్ రామంజినేయులు, ఆనంద్, ముక్కన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఉరవకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు మహబూబ్‌బాషా సూచించారు. మండలంలోని మూలగిరి పల్లి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా పౌరులకు కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

●బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో గల ఆర్డీటీ కాలనీలో తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలున్నాయని, వాటిపై ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా కఠినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతకుమారి పాల్గొన్నారు.

●బెళుగుప్ప: మండలంలోని హనిమిరెడ్డిపల్లిలో పౌర హక్కుల దినోత్సవంపై తహసీల్దార్ షర్మిల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. సీనియర్ అసిస్టెంట్ దామోదర్, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.